



# విజయభాను

విశాఖపట్నం, ఆదివారం 27-08-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 47 సంచిక : 279 పేజీలు : 08 వెల : 1 రూపాయి


## చంద్రయాన్ - 3 దిగిన ప్రదేశానికి 'శివశక్తి' పేరు

### ఆగస్టు 23వ తేదీని నేషనల్ స్పేస్ డేగా జరుపుకోవాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

### బెంగళూరులో మోదీ.. 'జై విజ్ఞాన్, జై అనుసంధాన్' నినాదాలు





బెంగళూరు: చంద్రయాన్ – 3 ద్వారా అసాధారణ విజయం నమోదు చేశామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ మేరకు ఇస్రో శాస్త్రవేత్తలకు సెల్యూట్ చేస్తున్నట్లు భావోద్వేగానికి గురయ్యారు. చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించేందుకు.. విదేశీ పర్యటన ముగించుకొని ప్రధాని నేరుగా బెంగళూరుకు వచ్చారు. విమానాశ్రయం వద్దకు వచ్చిన అభిమానులకు మోదీ అభివాదం చేశారు. అక్కడి నుంచి నేరుగా పీణ్యలోని ఇస్రో కేంద్రానికి వెళ్లి.. శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ సందర్భంగా చంద్రయాన్–3 ప్రయోగం తీరును ప్రధానికి ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ వివరించారు. అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. 'జై విజ్ఞాన్.. జై అనుసంధాన్' నినాదం ఇచ్చారు.

**ఇది అసాధారణ విజయం**

"ఇస్రో సాధించిన విజయం చాలా గర్వకారణం. చంద్రయాన్ – 3 సాఫ్ట్ ల్యాండింగ్ సమయంలో దక్షిణాఫ్రికాలో ఉన్నా. నా మనసంతా చంద్రయాన్ – 3 విజయంపైనే ఉంది. విజయం పట్ల శాస్త్రవేత్తలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఇది అసాధారణ విజయం. చంద్రుడిపై భారత్ అడుగుపెట్టింది. అంతరిక్ష చరిత్రలో సరికొత్త చరిత్ర సృష్టించాం. ఇప్పుడు భారత్ చంద్రుడిపై ఉంది. మన సత్తా ఏమిటో ప్రపంచానికి చాటాం. ప్రపంచంలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపగలమని నిరూపించాం. గతంలో ఎవరూ చేయలేనిది ఇప్పుడు ఇస్రో చేసింది చంద్రయాన్ – 3 దిగిన ప్రదేశానికి శివశక్తి పేరు పెట్టుకుందాం. 2019లో చంద్రయాన్–2 క్రాష్ ల్యాండ్ అయిన ప్రదేశానికి గుర్తింపునిస్తూ దానిని 'తిరంగా పాయింట్' అని పిలుచుకుందాం.

**ఇంటిపైనే కాదు.. చంద్రుడిపైనా మన త్రివర్ణ పతాకం**

చంద్రయాన్ –2 వైఫల్యంతో మనం వెనకడుగు వేయలేదు. మరింత పట్టుదలతో పనిచేసి చంద్రయాన్ –3 విజయం సాధించాం. ఇప్పుడు ప్రతి ఇంటిపైనే కాదు.. చంద్రుడిపైనా త్రివర్ణ పతాకం ఎగురుతోంది.. శాస్త్ర, సాంకేతికరంగాల్లో భారత్ దూసుకెళ్తోంది. ప్రపంచానికే భారత్ దిక్సూచిగా మారుతోంది. చంద్రయాన్ – 3 కృషిలో మహిళా

తరువాయి 2లో..

## భానుడిపై పరిశోధనలకు ఇస్రో సిద్ధం..

### సెప్టెంబరు 2న ఆదిత్య-ఎల్ 1 ప్రయోగం



బెంగళూరు: జాబిల్లి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్–3 ని విజయవంతంగా దించి అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్రను లిఖించింది భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ ఇప్పుడు అదే ఉత్సాహంపై సూర్యుడి రహస్యాలను కనుగొనేందుకు ఇస్రో సిద్ధమైంది. సెప్టెంబరు 2వ తేదీన ఆదిత్య–ఎల్ 1 ప్రయోగం చేపట్టనుంది. ఈ విషయాన్ని ఇస్రో అధికారి ఒకరు వెల్లడించారు.

"సెప్టెంబరు 2న ఈ ప్రయోగం చేపట్టే అవకాశాలున్నాయి" అని సదరు అధికారి తెలిపారు. ఇప్పటికే ఈ ఉపగ్రహాన్ని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)కు తీసుకొచ్చారు. పీఎస్ఎల్వీ–సి57 వాహకనౌక.. ఆదిత్య–ఎల్ 1ను మోసుకుని నింగిలోకి దూసుకెళ్లనుంది. కరోనాగ్రఫీ పరికరం సాయంతో సౌర వాతావరణాన్ని లోతుగా పరిశోధించడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, ఆస్ట్రేలియా, ఇతర దేశాల అంతరిక్ష సంస్థల సాయంతో ఇస్రో సౌర అధ్యయన ప్రక్రియను చేపట్టనుంది.

**ఆదిత్య–ఎల్ 1 విశేషాలివే..**

సూర్యుడి ని అధ్యయనం చేసేందుకు ఇస్రో చేపడుతున్న తొలి మిషన్ ఇది. 1500 కిలోల బరువున్న శాటిలైట్ ఇది.

భూమి నుంచి సూర్యుని దిశగా 1.5 మిలియన్ కిలోమీటర్ల దూరంలోని లాగ్రాంజ్ పాయింట్ 1 (ఎల్ 1) చుట్టూ ఉన్న కక్ష్యలో దీన్ని ప్రవేశపెట్టనున్నారు. ఈ కక్ష్యలోకి పంపించడం ద్వారా గ్రహణాలతో సంబంధం లేకుండా సూర్యుడిని నిరంతరం అధ్యయనం చేసేందుకు వీలు లభిస్తుంది. ఆదిత్య–ఎల్ 1 మొత్తం ఏడు పేలోడ్లను మోసుకెళ్లనుంది. ఇందులో ప్రధానమైన 'విజిబుల్ ఎమిషన్ లైన్ కొరోనాగ్రాఫ్ (వీఈఎల్సీ)తో పాటు సోలార్ అల్ట్రావైలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్, ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్

తరువాయి 2లో..

## జగన్‌ను చూసి ప్రజాస్వామ్యం సిగ్గుపడుతోంది

### తెదేపా అధినేత చంద్రబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో తప్పుడు సర్వేలతో ప్రజలను మభ్యపెడుతూ.. వైకాపా బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తోందని తెదేపా అధినేత చంద్రబాబు విమర్శించారు. తన 45 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ఇలాంటి అమానుషమైన, పనికిమాలిన ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదన్నారు. రాజకీయ కక్ష సాధిస్తూ ఎక్కడికక్కడ విధ్వంసం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో నూటికి నూరు శాతం చిత్తుచిత్తుగా వైకాపా ఓడిపోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో

తరువాయి 2లో..

## రాజకీయ పునరావాస కేంద్రంగా టిటిడి

### : బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి



అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పాలకమండలి నియామకాలపై ఏపీ భాజపా అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తితిదే బోర్డు రాజకీయ పునరావాస కేంద్రమని మళ్లీ నిరూపించారని విమర్శించారు. బోర్డు సభ్యులుగా శరత్ చంద్రారెడ్డి, కేతన్ దేశాయ్ నియామకమే ఇందుకు

తరువాయి 2లో..

## నైజీన్ సరస్సులో సోనియా గాంధీ ప్రయాణం

శిమ్లా: జమ్ముకశ్మీర్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియాగాంధీ తాజాగా శ్రీనగర్‌లోని నైజీన్ సరస్సులో బోటు షికారు చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అయితే ఇది కేవలం కుటుంబ పర్యటన మాత్రమేనని, ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ కూడా ప్రస్తుతం శ్రీనగర్‌లోనే ఉన్నారు. ఇటీవల లద్దాఖ్‌లో పర్యటించిన ఆయన.. శుక్రవారం ఉదయం కార్గిల్‌లో బహిరంగ ర్యాలీని పూర్తి చేసుకొని శ్రీనగర్‌కు చేరుకున్నారు. మరోవైపు ఆయన సోదరి ప్రియాంక గాంధీ, తన భర్త రాబర్ట్ వాద్రాతో కలిసి శ్రీనగర్‌కు చేరుకోనున్నారు.

వీరంతా రెండు రోజుల పాటు శ్రీనగర్‌లో గడిపి అక్కడి నుంచి గుల్మార్గ్‌కు వెళతారు. గత కొన్నేళ్లుగా శ్రీనగర్‌లోని 'రైన్‌వారి' ప్రాంతంలోని ఓ హోటల్‌లో రెండు రాత్రులు నిద్ర చేయడం ఈ కుటుంబానికి సెంటిమెంట్‌గా వస్తోంది. అయితే, ఈ సారి రాహుల్ గాంధీ నైజీన్ సరస్సులోని బోట్ హౌస్‌లో ఉంటారని సమాచారం. మిగతా కుటుంబ సభ్యులు మాత్రం వారి సెంట్‌మెంట్ మేరకు పాత హోటల్‌లోనే బస చేయనున్నారు.

## ఏయూలో ఇండస్ట్రీ 4.ఓ సెంటర్

ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఇండస్ట్రీ 4.ఓ కేంద్రం ఏర్పాటు కానుంది. భారత ప్రభుత్వ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖకు అనుబంధంగా పనిచేసే సమ్రత్ ఉద్యోగ్ టెక్నాలజీ ఫోరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సదాశివ్ పాఢి, ఆపరేషన్స్ విభాగాధిపతి రాజేష్ పహాడిలు ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఏయూలో ఇండస్ట్రీ 4.ఓ కేంద్రం ఏర్పాటుకు అనువైన ప్రాంతం, అనువైన భవనాలు తదితర అంశాలను పరిశీలించడానికి వచ్చారు. ఈ సందర్భంగా వీరు ఏయూలో ఇప్పటికే నిర్వహిస్తున్న పలు స్టార్టప్ సంస్థల పనితీరు పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడారు. ఫోరం ప్రతినిధులు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో పాలక మండలి సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఏయూలో ఇండస్ట్రీ 4.ఓ సెంటర్ ఏర్పాటు చేయడానికి అనుకూల పరిస్థితులు ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. త్వరలో కేంద్ర మంత్రిత్వశాఖ అనుమతి తీసుకుని ఏయూలో సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఏయూలో జరుగుతున్న మౌళిక వసతుల అభివృద్ధి, బోధన పద్ధతలను తెలుసుకుని దేశానికి ఉపయుక్తంగా ఏయూ చేస్తున్న కృషిని అభినందించారు. ఏయూ ఐపిఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం ఏయూలో రూ 3 కోట్ల వ్యయంతో ఇండస్ట్రీ 4.ఓ ఏర్పాటుకు అవసరమైన ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తీర్చిదిద్ది అందించారు.



ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గత నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నూతన ప్రాజెక్టులను వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులను వర్సిటీ తరపున సత్కరించారు.




# కురుపాం మార్కెట్లో ఆక్రమిత దుకాణం స్వాధీనం




విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** విశాఖపట్నం ఒన్టౌన్ లోని దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన కురుపాం మార్కెట్ నందు గల షాపు నెం 45బి ను కోరంగి దేముడమ్మ,ఐదు ఏళ్ల క్రితం బహిరంగ వేలంలో పాడుకొని అద్దె బకాయిపడ్డారు.లీజు కాలము పూర్తి అయినప్పటికీ ఖాళీ చేయక ఆక్రమణదారునిగా కొనసాగుతున్నారు. అయితే ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం యొక్క ఆర్డినెన్స్ నెం.5/2023 ప్రకారం సెక్షన్ 83 ఆంధ్ర ప్రదేశ్, ఎండోమెంట్స్ యాక్ట్ ను అనుసరించి ఆమెకు రెండు పర్యాయములు నోటీస్ ఇచ్చారు.

ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 11 గంటలకు జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి కె. శిరీష, కార్యనిర్వహణాధికారి పి. శేఖర్ బాబు మరియు ఇతర దేవాలయాల కార్యనిర్వహణాధికారులు, సిబ్బంది, విఆర్ఒ సాయి ప్రకాష్, 1వ పట్టన పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ జి. సంతోష్, ఎ.ఎస్.ఐ. ఏం.వి. లక్ష్మి, పోలీసు కానిస్టేబుల్స్ ఎస్.కె. రజియా, పి. నీలిమల సమక్షంలో పంచనామా నిర్వహించి సదరు దుకాణము స్వాధీనము చేసుకున్నారు.

# నేడు రారవే సమావేశం

రాజాం (విజయభాను న్యూస్) : పట్టణంలో శ్రీ విద్యానికేతన్ లో ఆదివారం రాజాం రచయితలవేదిక 103వ సమావేశం నిర్వహించనున్నామని రారవే నిర్వాహకులు గార రంగనాథం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని అన్నారు. సమతం మహేశ్వరరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వావిలవలస జమీందారి నాడు-నేడు అనే అంశంపై రంగనాథం మాష్టర్ ప్రసంగం చేయనున్నారు. రాజాం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన కవులు, వక్తలు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

# మల్కాపురంలో ఘనంగా మదర్ థెరిసా జయంతి వేడుకలు



మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకుని కష్టాల్లో ఉన్న వారికి సాయం అందించడానికి సామాజిక సేవాకార్యకర్తలు ముందుకు రావాలని మల్కాపురం శాఖ గ్రంథాలయ అధికారి అజయ్ కుమార్

పిలుపునిచ్చారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మదర్ థెరిసా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎక్కడో పుట్టి ఈ దేశానికి వచ్చి అనాధలకు నిస్వార్థంగా మదర్ థెరిసా సేవలు చేశారని కొనియాడారు.

## బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ రాష్ట్ర పార్టీ విస్తృత స్థాయి సమావేశం లో పాల్గొన్న కోండ్రు



మంగళగిరి : మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నాడు జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ అనే కార్యక్రమంపై రాష్ట్ర పార్టీ విస్తృత స్థాయి సమావేశం లో మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ పాల్గొన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 45 రోజులపాటు నిర్వహించనున్న బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై 175 నియోజక వర్గం ఇంఛార్జి లకు నేతలకు చంద్రబాబు దిశా నిర్ధేశం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నేతలకు చంద్రబాబు పలు సూచనలు చేశారు. భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో తలపెట్టిన కార్యక్రమానికి ప్రజల నుంచి రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని అన్నారు. ఇంతే దూకుడుతో ప్రజల్లో పార్టీని మరింత బలంగా తీసుకువెళ్లేందుకు

బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్ళాలని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు.ప్రతీ నియోజవర్గం లో క్యాడర్ ను మరింత బలోపేతం చేసి నిత్యం ప్రజల్లో ఉంటూ వైసీపీ ప్రభుత్వం లో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు.పాదయాత్రలో ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలపై ప్రజలకు వివరిస్తూ తెలుగుదేశం పార్టీ సంక్షేమం అభివృద్ధి పై ప్రజలకు వివరిస్తూ బాబు ష్యూరిటీ - భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని బాబు సూచించారు.

# మానవత్వానికి ప్రతీక మదర్ థెరిస్సా

గాంధీ మందిరంలో జయంతి వేడుకలు

శ్రీకాకుళం: మానవత్వానికి, నిస్వార్ధ సేవకు ప్రతిరూపంగా మదర్ థెరిస్సా నిలుస్తారని రిటైర్డ్ అడిషనల్ డిఎంఅండ్ హెచ్వో డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో భారతరత్న మదర్ థెరిస్సా 113వ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహదాత డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ విదేశాల్లో జన్మించిన మదర్ థెరిస్సా భారతదేశంలో పేదలు, నిరాశ్రయులు, నిర్భాగ్యులకు సేవలు అందించి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ నిక్కు అప్పన్న, బరాటం లక్ష్మణరావు మాట్లాడుతూ మదర్ థెరిస్సాకు శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. అభాగ్యులకు సేవలందించి నోబుల్శాంతి బహుమతితో పాటు భారతరత్న పొందిన మహోన్నత వ్యక్తి కొన్ని సంవత్సరాలు క్రితం జిల్లాలో పర్యటించడం గొప్ప విషయమన్నారు. అవధాన పండితులు పైడి హరనాధరావు మాస్టార్ మదర్ థెరిస్సా గొప్పతనం వివరించే గేయం ఆలపించారు. తొలుత మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో గాంధీమందిర బృందం నటుకుల మోహన్, మహిబుల్లాఖాన్, నక్క శంకరరావు, పందిరి అప్పారావు, వావిలపల్లి జగన్నాథంనాయుడు, గుర్తు చిన్నారావు, తర్లాడ అప్పలనాయుడు, సువ్వారి రాజారావు, శాస్త్రి తదితరులున్నారు.

# అర్బన్ పీహెచ్ సీ భవనం పనులు పరిశీలన



రాజాం (విజయభాను న్యూస్) : పట్టణంలో ఆదర్శనగర్ వద్ద రూ. 86 లక్షలుతో నిర్మించిన ప్రభుత్వ అర్బన్ ప్రైమరి హెల్త్ సెంటర్ భవనాన్ని మున్సిపల్ ఏఈ పి.వెంకట్ శనివారం పరిశీలించారు. కాంట్రాక్టర్ వద్ద వివరాలు సేకరించారు. పనులు పూర్తీచేయాలని సూచించారు. త్వరలో ఈభవనాన్ని ప్రారంభిం చనున్నామని అన్నారు.

# వైజాగ్ లోటస్ హాస్పిటల్స్ లో అరుదైన ఘట్టం

- 16 మంది నవ జాతి శిశువులకు చికిత్సలు



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** గత 16 సంవత్సరాలుగా వైద్య చరిత్రలోనే లోటస్ హాస్పిటల్ ఫర్ వుమెన్ - చిల్డ్రన్ ఎన్నో అరుదైన రికార్డులు సొంతం చేసుకుంది అని నాంటాలజిస్ట్, పీ డియట్రిసియన్ డాక్టర్ మురళీసంతోష్ పేర్కొన్నారు. ఇదే సందర్భంలో తల్లి, పిల్లల వైద్యంలో సరికొత్త అధ్యయాన్ని లోటస్ హాస్పిటల్స్ సొంతం చేసుకుంది అన్నారు. ఈ మేరకు విశాఖలోని ఓ హెూటల్ లో శనివారం నిర్వహించిన సక్సెస్ మీట్ లో వైద్య బృందం, చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొని సందడిగా గడిపారు. గత 9 నెలల్లో తాను, ఆస్పత్రి వైద్య బృందం కలిసి 26 వారాల కంటే తక్కువ వయస్సు, చాలా తక్కువ బరువు వున్న 16 శిశువులకు విజయవంతంగా చిక్సితను అందించి వంద శాతం రికవరీ రేటును సాధించడం అత్యంత విజయంగా భావిస్తున్నామని డాక్టర్ మురళీ సంతోష్ అన్నారు.

సాధారణంగా ఈ శిశువుల మరణాలు 50 శాతానికి దగ్గరగా ఉంటాయి. డాక్టర్ మురళీ సంతోష్ బృందం కఠినమైన నర్సింగ్ కేర్ పర్యవేక్షణతో 100 శాతం మనుగడను సాధించడం అరుదైనది. అంతేకాకుండా వీరిలో ఎక్కువ భాగం ఆర్థిక స్థోమతను తట్టుకోలేని తల్లిదండ్రులకు లోటస్ హాస్పిటల్స్ ధైర్యాన్ని నింపి వారికి మానవతా దృక్పథంతో సేవలు అందించామని డాక్టర్ మురళీ సంతోష్ తెలిపారు. ఈ చికిత్సలకు విశాఖ వంటి నగరాల్లో రూ. లక్షలు వరకు ఖర్చు అవుతుంది అన్నారు. ఆస్పత్రి ఫౌండేషన్ ద్వారా 30 శాతం సొమ్ము భరిస్తున్నాము అని పేర్కొన్నారు. గత 8 ఏళ్లుగా ఈ చికిత్సలు విజయవంతంగా నిర్వ హిస్తున్నాము అని గుర్తు చేశారు. చిన్నారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ, లోటస్ హాస్పిటల్స్ యాజమాన్యం డాక్టర్ మురళీ సంతోష్ డాక్టర్ రమ్య, డాక్టర్ సంతోష్ కళ్యాణ్ టీం సభ్యుల సేవలు తాము మరువలేమని వాళ్ళకు ఎప్పుడు ఋణపడి ఉంటామని ఆనంద బాష్పాలతో ఆ తల్లిదండ్రులు వారి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

అనంతరం లోటస్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వి ఎస్ వి ప్రసాద్ మాట్లాడుతూ.. ఇంతటి ఘన విజయం సాధించిన తమ హాస్పిటల్ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.. ఇలాంటి మరెన్నో విజయాలు లోటస్ హాస్పిటల్ బృందం సాధించాలని ఆకాక్షించారు.

ఈ సక్సెస్ మీట్ లో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శిరీష రాణి, డాక్టర్ అనూష,డాక్టర్ రమ్య, డాక్టర్ సంతోష్ కళ్యాణ్ ఇతర అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రయాన్ - 3 దిగిన ప్రదేశానికి 'శివశక్తి' పేరు

శాస్త్రవేత్తలు ఉండటం గర్వకారణం. మన నారీ శక్తి ఏమిటో ప్రపంచానికి మరోసారి చాటాం. ఇస్రో సాధించిన విజయం ఎన్నో దేశాలకు స్ఫూర్తినిస్తుంది

ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం

'మేకిన్ ఇండియా' ఇప్పుడు చంద్రుడి వరకు సాగింది. మంగళ్యాన్, చంద్రయాన్ విజయం స్ఫూర్తిని కొనసాగిద్దాం. ఈ విజయాల స్ఫూర్తితో గగన్యాన్కు సిద్ధమవుదాం. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా నిర్వహించుకుందాం. అంతరిక్ష విజ్ఞానంతో ఎన్నో ఫలితాలు అందుకోవాలి. వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఈ విజ్ఞానం ఉపయోగపడాలి. తుపానులను అంచనా వేయడంలో మరింత నైపుణ్యం సాధించాలి. వాతావరణ మార్పులను మరింత కచ్చితంగా తెలుసుకోవాలి" అని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.

# రాజకీయ పునరావాస కేంద్రంగా టిటిడి

నిదర్శనమన్నారు. దిల్లీ మద్యం స్కామ్లో శరత్చంద్రారెడ్డి పాత్రధారిగా ఉన్నారని ఆమె ఆరోపించారు. ఎంసీఐ స్కామ్లో దోషిగా తేలి కేతన్ దేశాయ్ పదవి కోల్పోయారన్నారు. తిరుమల పవిత్రతకు మచ్చ తెచ్చే ఈ విధానాన్ని భాజపా ఖండిస్తోందని పురందేశ్వరి తెలిపారు.

తితిదే పాలకమండలి సభ్యుల నియామకాల్లో సామాజిక సమతుల్యత దెబ్బతిందని భాజపా అధికార ప్రతినిధి లంకా దినకర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తిరుమల శ్రీవారి సేవ కన్నా.. తన సొంతవారి సేవ ప్రాధాన్యం అయిందని దుయ్యబట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాశస్త్యాన్ని దెబ్బతీయడం రాష్ట్ర ప్రభుత్వానికి నిత్యకృత్యం అయిందని ధ్వజమెత్తారు. మద్యం కుంభకోణంలో నిందితుడు శరత్ చంద్రారెడ్డికి, అనేక మంది ఆరోపణలు ఎదుర్కొంటున్న కళంకితులకు పదవులను కట్టబెట్టారని ఆరోపించారు.

# భానుడిపై పరిశోధనలకు ఇస్రో సిద్ధం..


ఎక్స్పెరిమెంట్, ప్లాస్మా అనలైజర్ ప్యాకేజ్ ఫర్ ఆదిత్య, సోలార్ లో ఎనర్జీ ఎక్స్రే స్పెక్ట్రోమీటర్, హైఎనర్జీ ఎల్-1 ఆర్బిటింగ్ ఎక్స్రే స్పెక్ట్రోమీటర్, మ్యాగ్నెటోమీటర్ పేలోడ్లను అమర్చనున్నారు. సూర్యగోళం నుంచి ప్రసరించే అత్యంత శక్తిమంతమైన కాంతి ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు అనువుగా ఈ పేలోడ్లను రూపొందించారు. ఈ పేలోడ్లు ఎలక్ట్రోమ్యాగ్నెటిక్, మ్యాగ్నెటిక్ ఫీల్డ్ డిటెక్టర్ల సాయంతో సూర్యుడిలోని పొరలైన ఫొటోస్పియర్, క్రోమోస్పియర్, వెలుపల ఉండే కరోనాను అధ్యయనం చేస్తాయి.

ఎల్-1 ప్రదేశానికి ఉన్న సానుకూలతల దృష్ట్యా నాలుగు పరికరాలు నేరుగా సూర్యుడిని అధ్యయనం చేస్తాయి. మిగతా మూడు సాధనాలు.. సమీపంలోని సౌర రేణువులు, అయస్కాంత క్షేత్రాల గురించి శోధిస్తాయి. ఈ నెల 23న చంద్రయాన్-3 ల్యాండర్ జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన విషయం తెలిసిందే. అందులోని రోవర్ చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలు సాగిస్తోంది.

# జగన్ను చూసి ప్రజాస్వామ్యం సిగ్గుపడుతోంది

చంద్రబాబు మాట్లాడారు. "జగన్ పని అయిపోయింది. మరో ఆరు నెలల్లో ఇంటికి పోవడం ఖాయం. జగన్ను చూసి ప్రజాస్వామ్యం సిగ్గుపడుతోంది. జగన్ను భరించే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరు. దేవుడు స్క్రిప్ట్ తిరగరాశాడు. అదే వైకాపా పతనం. ప్రజల్లో మమేకమై వైకాపా ఆగడాలు అరికడతాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఓటర్లు తెదేపా వైపే ఉన్నారు. ఇండియాటుడే ఓటర్ సర్వే ప్రకారం రానున్న ఎన్నికల్లో తెదేపాకు 15 ఎంపీ స్థానాలు రావడం ఖాయం. సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్గా తెలుగుదేశం పార్టీ నిలిచింది. నాలుగున్నర ఏళ్లలో ఏం నష్టపోయామో ప్రజలకు చెప్పాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలంతా మాతో కలిసి రావాలి. నిన్నిక భరించలేం.. బై బై జగన్ .. ఇదే అందరి నినాదం కావాలి. ఇసుక దోపిడీకి వ్యతిరేకంగా ఎల్లుండి నుంచి ఆందోళనలు. జగన్, పెద్దిరెడ్డి, జే-గ్యాంగ్.. రూ.40వేల కోట్ల విలువైన ఇసుక దోచేశారు. 98శాతం హామీలు అమలు చేశామంటూ వైకాపా చెప్పేవన్నీ అబద్ధాలే. తితిదే బోర్డు సభ్యులుగా నేరగాళ్లకు స్థానం కల్పిస్తారా? జగన్ మళ్లీ వస్తే రాష్ట్ర పరిస్థితి ఏంటో ప్రజలకు వివరించాలి. బాబు భరోసా.. భవిష్యత్తుకు గ్యారెంటీ.. అనేదే మన నినాదం" అని చంద్రబాబు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

## ఘనంగా పరవాడ అభయాంజనేయ స్వామి ఆలయ పున : నిర్మాణానికి భూమి పూజ



పరవాడ:-పరవాడ సంతబయలు వద్ద శ్రీ అభయ ఆంజనేయస్వామి వారి ఆలయం పునర్నిర్మాణానికి ప్రముఖ సిద్ధాంతి గౌ౹౹ శ్రీమాన్ రేజేటి రామాచార్యులు(రాంబాబు) ఆధ్వర్యంలో పరవాడ ఎంపీపీ పైల పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులు,పరవాడ సర్పంచ్ సిరిపురపు లక్ష్మి అప్పలనాయుడు దంపతులు,మాజీ సర్పంచ్ చుక్క లక్ష్మి రామునాయుడు దంపతులు,వైస్ సర్పంచ్ బండారు లక్ష్మి రామారావు దంపతులు చే శంఖుస్థాపన మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది... ఈ కార్యక్రమంలో పరవాడ గ్రామంలో గల ప్రజలు,భక్తులు,యువజనులు పంచాయతీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## 61వ వార్డులో రూ.50 లక్షలతో పిల్లలకు డైనింగ్ హాల్ పైలెట్ వాటర్ ప్రాజెక్ట్ యు వి ఆర్ ఓ వాటర్ ప్లాంట్



ములగాడ( విజయభాను న్యూస్) : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి సహకారంతో పశ్చిమ నియోజకవర్గం జీవీఎంసీ 61 వ వార్డు మల్కాపురం హై స్కూల్ నందు రూ. 50 లక్షలతో పిల్లలకు డైనింగ్ హాల్ పైలెట్ వాటర్ ప్రాజెక్ట్, యు వి ఆర్ ఓ వాటర్ ప్లాంట్, పనులకు 61 వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ శంకుస్థాపన చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ విద్య వైద్య రంగాలకు ముఖ్య మంత్రి జగన్మోహనరెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఇటువంటి కార్యక్రమానికి సహాయ సహకారాలందించిన ఐ ఓ సి సంస్థ కు కృత్ఞతలు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం వైకాపా సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు చేపట్టామన్నారు. వార్డులో సంక్షేమం, అభివృద్ధి కి పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ డి సి వై. శ్రీనివాసరావు, డి ఈ ఓ డి. శ్రీనివాసరావు, ఇండియన్ ఆయిల్ కంపెనీ యాజమాన్యం జనరల్ మేనేజర్ సూరజ్ కుమార్ పట్నాయక్, చీఫ్ ఇంజనీర్ సంధ్య ,సీనియర్ మేనేజర్ అరుణ్ ప్రసాద్, మల్కాపురం ప్రైమరీ స్కూల్ హెచ్ఎం అరుణ కుమారి, ఐ ఎన్ టి సి యూనియన్ నాయకులు బి నాగభూషణం,ప్రైమరీ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్లపూడి రైల్వే క్వార్టర్స్ శివాలయంలో శాస్త్రోక్తంగా పునః ప్రతిష్ట మహోత్సవాలు



గాజువాక(విజయభాను న్యూస్): జీవీఎంసీ 71వ వార్డు వడ్లపూడి రైల్వే క్వార్టర్స్ లో అతి పురాతనమైన శివాలయంలో విగ్రహాల పునః ప్రతిష్ట మహోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ భాజపా నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు,జ్యోతి దంపతుల పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. భాజపా ఎంపీ(రాజ్యసభ)జీవీఎల్ నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని శివలింగం,వారాహి అమ్మవారు,పార్వతీదేవి,గణపతి విగ్రహాలకు పూజలు చేశారు. ఆదివారం కళస ప్రతిష్టతో పాటు విగ్రహాలను ప్రతిష్టించనున్నారు.ఈ సందర్భంగా ఎంపీ జీవీఎల్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక%శీ%గా ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందాలన్నదే భాజపా అభిమతం అని అన్నారు.చాలా ఆలయాలు మరుగున పడి అభివృద్ధి చెందలేదని,హిందూ దేవాలయాలను పరిరక్షించి,వాటిని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.పచ్చని ప్రకృతి,చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నప్పటికీ ఇక్కడ క్వార్టర్స్,వాటి పరిసరాల్లో ఆలయాలు,పార్కులు,ఇతర అవసరాలను స్థానికులు ఎంపీకి వివరించారు.త్వరలో మరోసారి ఈ ప్రాంతాన్ని సందర్శించి కావలసిన సదుపాయాలకై కృషి చేస్తానన్నారు.ఆలయ పురోహితులు సుబ్రహ్మణ్య ఫణిశర్మ నేతృత్వంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దలాయ్,రమణారావు, అప్పారావు,కరణం వెంకటరావు,సాంబమూర్తి,కృష్ణంరాజు, సత్యసాయి ఆర్గనైజేషన్ ప్రతినిధి శ్రీరామ్మూర్తి , నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కథక్ నాట్య నిపుణులు పద్మశ్రీ నళిని, కమలినిలకు వైశాఖి జీవన సాఫల్య పురస్కారం-2023



విశాఖపట్నం, : న్యూ ఢిల్లీకి చెందిన ప్రసిద్ధ కథక్ నృత్య కళాకారులు పద్మశ్రీ పురస్కార గ్రహీతలు నళిని, కమలిని సోదరీమణులు "వైశాఖి జీవన సాఫల్య పురస్కారం"-2023కు ఎంపికయ్యారు. జాతీయ, అంతర్జాతీయ కీర్తి శిఖరాలనదిష్టించిన ప్రతిష్మాత్మక 15వ వార్షిక వైశాఖి నృత్యోత్సవం సందర్భంగా లబ్ధప్రతిష్ఠులకిచ్చే వైశాఖి జీవన సాఫల్య పురస్కారం(లైఫ్ టైం ఎఛీవ్‌మెంట్ అవార్డు) ఈ ఏడాది ప్రపంచ ప్రఖ్యాత కథక్ నాట్యకత్తెలు నళిని, కమలిని స్వీకరించనున్నారు. కళాభారతి ఆడిటోరియంలో సెప్టెంబర్ 15 నుండి 17 వరకు జరిగే 15 వ వైశాఖీ నృత్తోత్సవంలో అతిథులు, నిర్వాహకుల చేతులమీదుగా ఈ అవార్డుల్ని అందచేస్తారు. వారణాసి ఘరానాకు చెందిన గురు జితేంద్ర మహరాజ్ తీర్చిదిద్దిన అపురూప భారతీయ సాంస్కృతిక సంపదగా వీరిరువురు ప్రపంచవ్యాప్తంగా వాసికెక్కారు. టెంపుల్ కథక్ నృత్య రీతిలో విశేష ప్రావీణ్యం కలిగిన వీరు తరచూ పార్లమెంటు, రాష్ట్రపతి భవన్ వంటి సమున్నత భారతీయ స్థలాలలో ప్రదర్శనకు ఆహ్వానాలందుకుంటారు. ఇంగ్లండ్, అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, నార్వే, మిడిల్ ఈస్ట్ దేశాలలో ఇంకా ప్రపంచంలో పలు చోట్ల నళిని, కమలిని సోదరీమణుల నాట్య ప్రదర్శనలు, లెక్చర్ డెమోలకు విశేష సంఖ్యలో అభిమానులున్నారు. ఎప్పటిలాగే తమ నిపుణుల కమిటీ ప్రమాణాల ప్రకారం కేంద్ర సంగీత నాటక అకాడెమీ అవార్డు గ్రహీతలు నళిని, కమలినిలను ఎంపిక చేసినట్టు నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ వ్యవస్థాపక అధక్షకుడు, ఫెస్టివల్ డైరెక్ర్ బి.ఆర్ విక్రమ్ కుమార్(బత్తిన విక్రమ్ గౌడ్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖలో ప్రప్రథమంగా వీరి ప్రదర్శనావకాశం నాట్యకళా ప్రియులకు అరుదైన అవకాశమని ఆయన పేర్కొన్నారు.

## మణిపూర్ లో జరుగుతున్న మారణ కాండపై మహిళల నిరసన

ములగాడ( విజయభాను న్యూస్) : మణిపూర్ లో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మహిళలకు రక్షణ కల్పించాలంటూ మల్కాపురంలోని నవజ్యోతి పరస్పర సహాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ సమావేశం జరిగాయి. ర్యాలీని నవజ్యోతి మాక్స్ డైరెక్టర్ సిస్టర్ సంగీత ప్రారంభించి మాట్లాడుతూ- మణిపూర్ లో మహిళలను నగ్నంగా ఊరేగించడం అమానుషమైన విషయము అని, నాగరిక సమాజం దీనిని ఖండించాలని అన్నారు. మనిషికి మనిషికి మధ్య మానవత్వం ఉండాలని కుల మతాలు కాదని అన్నారు. మణిపూర్ లోని మహిళలకు సంఘీభావంగా ఈ ర్యాలీని సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. సమావేశంలో ముఖ్య వక్తగా పాల్గొన్న జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ .పి. ఎస్. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ- మణిపూర్లో కుకీలకు, మైథిలకు మధ్య జరుగుతున్న పోరాటం దేశాన్ని అనైక్యతకు గురి చేస్తోందని అన్నారు. ఎక్కడ మారణహోమం జరిగినా, చివరకు బలయ్యేది మహిళలే అని, ఈ పరిస్థితి మారాలని అన్నారు. మహిళల హక్కులే మానవ హక్కులనీ ,మహిళలకు రక్షణ కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. సమావేశంలో సీనియర్ యానిమేటర్ వెంకటలక్ష్మి, జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి




వై.అనసూయదేవి ప్రసంగించారు. కార్యక్రమంలో యానిమేటర్స్ మేరీ, సుశీల, విజయ, హేమలత, తులసి తదితరులు,పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సమావేశానికి ముందు ర్యాలీ నవ జ్యోతి మ్యాక్స్ నుండి హాస్పిటల్ వరకు కొనసాగింది.

# డెంగ్యూ నివారణపై అవగాహన

విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** భారతదేశాన్ని డెంగ్యూ రహితంగా మార్చే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు డాబర్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్ హోమ్ కేర్ సనత్ పులిక్కల్ తెలిపారు. 'మేకింగ్ ఇండియా డెంగ్యూ ఫ్రీ' క్యాంపెయిన్లో భాగంగా పెదవాల్తేరులోని కేడీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం దోమకాటుపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో డెంగ్యూ కలిగించే దోమల నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఒడోమస్ దోమల నివారణ క్రీములను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పులిక్కల్ మాట్లాడుతూ ఇండియాలో అత్యధిక మంది ఇష్టపడే దోమల నివారణ బ్రాండ్ ఒడోమస్ బ్రాండ్ అన్నారు. ఈ ప్రచారం దేశవ్యాప్తంగా పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులను కవర్ చేస్తుందన్నారు.

డెంగ్యూ ఇతర ప్రాణాంతకమైన దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల నుంచి ప్రజలను సురక్షితంగా ఉంచడానికి ఒడోమోస్ కృషి చేస్తోందని తెలిపారు. ఈ మిషన్‌లో ముందుకు సాగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ దోమ కాటుకు గురికాకుండా సహాయపడతామన్నారు. ఇటీవలి సంవత్సరాలలో డెంగ్యూ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఒక ముఖ్యమైన అంశం ఏమిటంటే, డెంగ్యూ అనేది రోజు కుట్టే దోమ ఈడిస్ అజెప్టి వల్ల వస్తుందనే వాస్తవం పై అవగాహన లేకపోవడమేనన్నారు. విద్యార్థులు ఆరుబయట ఉన్నప్పుడు, పని, ఇంటి మధ్య లేదా పాఠశాలలు, ఆట స్థలాలలో ఉన్నప్పుడు ఈ దోమ బారిన పడే అవకాశం ఉందన్నారు. నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ శశిభూషణ్ మాట్లాడుతూ డెంగ్యూ వంటి వ్యాధులు రాకుండా నివారణ చర్యలు కీలకమన్నారు. ఇక దోమల కాలం సమీపిస్తున్నందున, పిల్లలతో పాటు కార్యాలయాలకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. మేకింగ్ ఇండియా డెంగ్యూ రహిత ప్రచారంలో భాగమైనందున సంతోషిస్తున్నానన్నారు. జనాదరణ పొందిన అభిప్రాయానికి విరుద్ధంగా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు పగటిపూట దోమల ద్వారా వ్యాపిస్తాయన్నారు. ఈ దోమలు పిల్లలు ఆరుబయట ఆడుకునేటప్పుడే కాకుండా మూసి ఉన్న గదుల్లో కూడా కుట్టే ప్రమాదం ఉందన్నారు. దోమల బెడదతో కార్యాలయాల్లోని వ్యక్తులు కూడా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు.

ఈ సందర్భంగా డాబర్ ఇండియా లిమిటెడ్ హోమ్ కేర్ కేటగిరీ హెడ్ సంతోష్ జైస్వాల్ మాట్లాడుతూ ఒడోమస్ ప్రాణాంతక వ్యాధులను వ్యాప్తి చేసే పగటిపూట దోమల నుంచి వినియోగదారులకు పూర్తి రక్షణను అందించే ఏకైక ఉత్పత్తి అన్నారు. ప్రముఖ శిశువైద్యులు నిర్వహించిన పరీక్షలో డాబర్ ఒడోమోస్ శిశువులు, పిల్లలపై ఉపయోగించడానికి సురక్షితమని ధృవీకరించబడిందని తెలిపారు. డాబర్ ఒడోమోస్ చర్మానికి అనుకూలమైన యాంటీ మస్కిటో క్రీమ్, స్ప్రే, ఫాబ్రిక్ రోల్-ఆన్ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కేడీపీఎం ప్రిన్సిపల్ సుమతీబాయి, ఉపాధ్యాయులు, మూడు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్యాంకులు లక్ష్యాన్ని అధిగమించాలి

రాయచోటి : జిల్లాలో బ్యాంకుల వారీగా ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ గిరీష బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్లతో డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ (డిసిసి), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డిఎల్ఆర్సి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని అందు కు సంబంధించి అర్హత పొందిన లబ్దిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల వారిని ఆర్థికంగా నిలబె ట్టేందుకు ప్రవేశపెట్టిన 'పిఎంఇజిపి, పిఎంఎవై, స్టాండప్ ఇండియా, జగనన్న తోడు' పథకాలకు సంబంధించి అర్హత ఉన్న వారికి యువ పారిశ్రామిక, ఔత్సా హిక పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూరేలా అవకాశం కల్పించాలని చెప్పారు. జిల్లాలో స్టాండప్ ఇండియా పథకం లక్ష్య సాధన కోసం పూర్తి స్థాయి సహకారం అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ముద్ర స్కీము ద్వారా అర్హుల యిన వారందరికీ రుణాలను అందించడంలో బ్యాంకర్లు కృషి చేయాలని చెప్పా రు. జిల్లాలో 50 శాతం మంది పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని వీరికి పీఎంఈజిపి పథకంలో భాగంగా బ్యాంకులు పాడి పరిశ్రమకు రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి బ్యాంకర్లు అధికారులు కృషి చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధకం, చేనేత తదితర రంగా లపై దృష్టి సారించి జిల్లా ఆర్థిక ప్రగతికి దోహదపడాలన్నారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల పథకాలను అర్హులయిన లబ్దిదారులకు అందేలా బ్యాంకు అధికారులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పేదలకు ఇళ్ళు పథకంలో గృహ నిర్మాణం కోసం అదనంగా రుణాలు అవసరమైన మహిళలకు రుణ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ గృహరుణాలు మంజూరు చేసివారి ఆర్థిక అభివృద్ధికి సహకరిం చాలన్నారు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి గాను పిఎంఇజిపి ద్వారా 243 యూనిట్లకు గాను189 యూనిట్లు మంజూరు చేస్తారని తెలిపారు. 2023-24 జిల్లా క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి, పరిస్త్రమల శాఖ జిల్లా మేనేజర్ నాగరాజ, డిఆర్డిఎ పీడీ సత్యనారాయణ, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీష

## సర్వసభ్య సమావేశాన్ని అధికారులు ప్రాధాన్యతగా తీసుకోవాలి

అనంతగిరి, విజయభాను న్యూస్ : అనంతగిరి మూడు నెలలకు ఒకసారి మండల పరిధిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు సమస్యలపై చర్చ చేసేటటువంటి సర్వసభ్య సమావేశాన్ని మండల స్థాయి అధికారులు ప్రాధాన్యతగా తీసుకోవాలని ఎంపీపీ లిశెట్టి నీలవేణిలి సూచించారు .ఆమె అధ్యక్షతన శనివారం మండల పరిషత్ కార్యాలయంలో 10వ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కొంతమంది అధికారులు గైర్హాజరవడం వారి స్థానంలో క్షేత్రస్థాయి సిబ్బందిని పంపడం పై సమావేశంలో చర్చ జరిగింది. ప్రతిసారి చెబుతున్నప్పటికీ అధికారులు మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి కుంటి సాకులు చెబుతూ గైర్హాజరు అవడం సరికాదని సభ్యులు అభిప్రాయపడ్డారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై జిల్లా కలెక్టర్కు నివేదిక పంపాలని ఎంపీడీవోకు సూచించారు .90 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే కొన్నిచోట్ల అధికంగా వసూలు చేస్తున్నారని సభ్యులు సమావేశంలో ఆరోపించారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ







జరపాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్ని శాఖల్లో జరుగుతున్న కార్యకలాపాలను స్థానిక ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు తెలియజేయాల్సిన బాధ్యత ఉందని అన్నారు. పిడుగుపాటుకు పశువుల మృతి చెందుతున్న వాటికి బీమా రావడంలో కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయని ప్రతి ఒక్కరికి బీమా వచ్చేలా చూడాలని సభ్యులు డిమాండ్ చేశారు. విద్యాశాఖలో భవనాల అసంపూర్తిగా ఉండడాన్ని ప్రశ్నించారు. బురుగు, చిమిడివలస అంటే గ్రామాలకు పాఠశాల భవనాలు లేవని సభ్యులు సమావేశంలో చర్చించారు. గతంలో జరిగిన నాడు నేడు పనుల్లో లోటుపాట్లు ఉన్నాయని పేర్కొ న్నారు. మొదటి విడత నాడు , నేడు పనులు జరిగిన పాఠశాలలో మూడో విడుదల నిర్వహణ పనులకు నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉందని ఎ టి డబ్ల్యూ వెంకటరమణ తెలిపారు.

ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దీసరి గంగరాజు ఎంపీడీవో ఏవివి కుమార్, వైస్ ఎంపీపీలు బాడం శకుంతల, దూరు జయవర్ధని ఎంపీటీసీ సభ్యులు జయశ్రీ తవిటీ నాయుడు, అశోక్, రత్నకుమారి ,తమ్మన్న,మితుల, అరుణ,వెంకటలక్ష్మి, శ్రావణి , కోఆప్షన్ సభ్యులు షేక్ మదీనా సర్పంచులు పాగి అప్పారావు, రాములమ్మ పెంటమ్మ, సింహాద్రి ,సోమెల రూతు తదితరులు పాల్గొన్నారు.

## హెరిటేజ్ పాడిరైతులకు రుణాలు పంపిణీ

### మేనేజర్ కూండ్రపు శేషు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న పాడిరైతుల అభివృద్ధే డెయిరీ లక్ష్యమని మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు . శనివారం మండలంలో మడుతూరు గ్రామంలో హెరిటేజ్ పాడిరైతులకు రూ. 9 లక్షల రుణాలు ఆయన పంపిణీ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిపశువుల కృత్రిమ గర్భధారణకు రూ. 50 , ఆడ పెయ్యి పుట్టేందుకు 500 రూపాయలకే సేవలందిస్తున్నట్లు తెలిపారు . మేలుజాతి పశువులు కొనుగోలు కోసం15 లక్షల వరకు రుణాలు పంపిణీ చేస్తామన్నారు . పాడిరైతుల అభివృద్ధి కోసం హెరిటేజ్ డెయిరీ పాటుపడుతుందన్నారు . పాడి రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2 లక్షలు , సహజ మరణం అయితే రూ. 50,000 అందిస్తున్నామన్నారు . అన్ని డెయిరీల కంటే పాలుకు అధిక రేటు చెల్లిస్తున్నామన్నారు . ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు , శ్రీనివాసరావు , శివ , అప్పలరాజు తదితర పాడిరైతులు పాల్గొన్నారు .

# విజయభాను సంపాదకీయం

## అవార్డులు కైవసం చేసుకోవడం హర్షణీయం

జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో తెలుగు సినిమా అత్యధిక విభాగాల్లో అవార్డులు కైవసం చేసుకోవడం హర్షణీయం. దాదాపు ఏడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం జాతీయ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికై, ఈ ఘనత సాధించిన తొలి తెలుగు నటుడిగా రికార్డు సృష్టించిన అల్లు అర్జున్‌కు, వివిధ విభాగాల్లో అవార్డులు సాధించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర బృందానికి, ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచిన 'ఉప్పెన' టీమ్‌కు, 'కొండపొలం' సినిమాలో 'ధమ్‌ధమ్‌ధమ్' పాటకు ఉత్తమ గీత రచయితగా మరోమారు ఖ్యాతి గడించిన చంద్రబోస్‌కు, ఉత్తమ సంగీత దర్శకునిగా ఎంపికైన దేవీశ్రీప్రసాద్‌కు అభినందనలు. ఆరు దశాబ్దాల శాస్త్రవేత్తల కృషి చందమామపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడిస్తే.. ఏడు దశాబ్దాల తెలుగు చలనచిత్ర రంగ ఆకాంక్షలను 'పుష్పరాజ్' రూపంలో అల్లు అర్జున్ నెరవేర్చారు. ప్రజానాట్యమండలి ఘన వారసత్వంతో హాస్యనట శిఖరంగా అలరించిన అల్లు రామలింగయ్య మనవడిగా, దిగ్గజ సినీ నిర్మాత అల్లు అరవింద్ కుమారుడిగా ఆ హోదాలకే పరిమితం కాకుండా తనదైన కొత్త శైలితో, నటనా, నృత్య కౌశలంతో వెండితెరపై సత్తాచాటి సౌత్ ఇండియా స్టైలిష్ స్టార్‌గా కోట్లాది మంది ప్రేక్షకాభిమానాన్ని చూరగొనడం అల్లు అర్జున్ ప్రత్యేకత. ఎర్రచందనం దొంగలకు హీరోయిజాన్ని జోడించిన చిత్ర కథానాయకుడికి జాతీయ పురస్కారమా? అంటూ కొందరు పెదవి విరిచినా.. జాతీయ ఉత్తమ నట పురస్కారానికి అల్లు అర్జున్ నూటికి నూరు పాళ్లు అర్హుడేనని తెలుగు సినీ పరిశ్రమ యావత్తు గుండెలకు హత్తుకొని జేజేలు పలకడం ఆయన నటనా వైదుష్యానికి నిదర్శనం.

ప్రకటించిన 69వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో తెలుగు తారలు వెలుగులు విరజిమ్మినందుకు హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నా.. వ్యవస్థలో వేళ్లూనుకుపోయిన కుల వివక్ష జాఢ్యాన్ని ప్రశ్నిస్తూ సమాజాన్ని చైతన్య పరిచే 'జైభీమ్' లాంటి చిత్రాలకు అవార్డుల జాబితాలో చోటు దక్కకపోవడం పురస్కారాల ఎంపిక కమిటీ పారదర్శకతను ప్రశ్నార్థకం చేశాయి. కేంద్ర ప్రభుత్వ నిర్దేశంలో సంఘ్ పరివార్ మెప్పుల కోసమే జ్యూరీ పనిచేసినట్లుగా కొన్ని ఎంపికలు తేటతెల్లం చేస్తున్నాయి. మత విద్వేషాలు రాజేసే దురుద్దేశంతో సంఘ్ పరివార్ పెద్దల దిశానిర్దేశంతో వండివార్చిన కథాంశంతో అనేక వివాదాలు మూటగట్టుకొని తెరకెక్కిన 'ది కాశ్మీర్ ఫైల్స్'ను ఏకంగా జాతీయ సమగ్రత చిత్రంగా ఎంపిక చేయడం, అలాగే శత్రు దేశాల గూఢచారిగా పనిచేశారన్న ఆరోపణలతో వివాదాస్పద వ్యక్తిగా చరిత్రలో నిలిచిన 'నంబి నారాయణ్' జీవితకథ ఆధారంగా రూపొందించిన 'రాకెట్రీ– ది నంబీ ఎఫెక్ట్' చిత్రానికి జాతీయ ఉత్తమ చిత్రం పురస్కారం ప్రకటించడం జ్యూరీ నిర్ణయాల నిజాయతీని శంకిస్తున్నాయి. స్వేచ్ఛగా, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ సంస్థలు, అత్యున్నత విద్యా, సాంకేతిక, పరిశోధన సంస్థల్లో మనువాద జాఢ్యాన్ని జొప్పిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చివరకు చలన చిత్ర పరిశ్రమ పురస్కారాలకూ ఈ మకిలీని అంటించడం సిగ్గుచేటు. మతాల మధ్య విద్వేషాలు రాజేయడం ద్వారా సమాజాన్ని చీల్చి రాజకీయ లబ్ది పొందాలనే దురుద్దేశంతో, ప్రజల భావోద్వేగాలను సొమ్ము చేసుకునే కుట్రపూరిత వ్యూహాల్లో భాగంగానే ది కాశ్మీర్ ఫైల్స్, ఆ తర్వాత ది కేరళ ఫైల్స్, రాకెట్రీ వంటి చిత్రాలు సంఘ్ పరివార్ దిశానిర్దేశంతో తెరకెక్కాయన్నది జగద్విదితమే. కుల వివక్ష నిర్మూలనకు కృషి చేసిన 'జైభీమ్' లాంటి చిత్రాలను విస్మరించడం, మత విద్వేషాలు రాజేసే 'ది కాశ్మీర్ ఫైల్స్' లాంటి చిత్రాలను నెత్తిన పెట్టుకోవడం జాతీయ పురస్కారాల స్థాయిని దిగజారుస్తాయి.

ఆశ్చర్యకరంగా బాలీవుడ్ ప్రధాన తారాగణం జాతీయ పురస్కారాలపై మౌనం దాల్చడం మరో విశేషం. సామాజిక మాధ్యమాల్లో చాలా క్రియాశీలకంగా వ్యవహరించే సూపర్ స్టార్ అమితాబ్ బచన్‌తో పాటు షారుఖ్‌ఖాన్, అక్షరు కుమార్, హృతిక్ రోషన్ తదితర తారలు కనీసం అభినందనలు కూడా చెప్పకపోవడం చర్చనీయాంశమైంది. అజరు దేవగణ్ ఒక్కరే 'రాకెట్రీ' బృందానికి అభినందనలు తెలిపినా.. తాను స్వయంగా నటించిన 'ఆర్‌ఆర్‌ఆర్' బృందానికి అభినందనలు చెప్పకపోవడం విస్మయం కలిగిస్తోంది. చాలా మంది బాలీవుడ్ నటులు తమ ఇండిస్ట్రీకే చెందిన అలియా భట్, కృతి సనన్‌లకు పురస్కారాలు లభించినా ఎలాంటి స్పందన వ్యక్తం చేయకపోవడం జాతీయ చలన చిత్ర పురస్కారాల పట్ల బాలీవుడ్ అసంతృప్తికి దర్పణం పట్టింది. ఏదేమైనా సాహిత్యం, ప్రజా కళలు, చిత్ర రంగం ప్రజలను ప్రభావితం చేసే శక్తిమంతమైన మాధ్యమాలు. స్వార్థపూరిత స్వీయ రాజకీయ ప్రయోజనాల కోసం వీటిని ఉపయోగించుకోజూడడం విచారకరం. స్వేచ్ఛగా, స్వతంత్రంగా సాహిత్యం, కళలు వర్ధిల్లేలా చూడాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉంది.

## ట్రంప్ మగ్‌షాట్ ఫొటో.. అందంగా ఉన్నారంటూ బైడెన్ సెటైర్

వాషింగ్టన్: అమెరికా చరిత్రలోనే మగ్‌షాట్‌తీయించుకొన్న తొలి మాజీ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ నిలిచారు. దీంతో అధ్యక్షుడు జో బైడెన్ ట్రంప్ మగ్‌షాట్ ఫొటోపై సెటైర్ వేశారు. తాహెూలోని వ్యాయామ క్లాస్ నుంచి బయటకు వచ్చే సమయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "ట్రంప్ నిజంగా అందమైన, అద్భుతమైన వ్యక్తి" అని బైడెన్ సెటైర్ వేశారు. అయితే, ట్రంప్ జార్జియాలోని ఫుల్టన్ కౌంటీ జైల్లో ఉన్న సమయంలో బైడెన్ నిధుల సేకరణకు సంబంధించి ఈమెయిల్స్‌ను తన మద్దతుదారులకు పంపించారు. మనం ప్రచారాన్ని మొదలుపెట్టేందుకు ఇంతకంటే మంచి రోజు ఇంకోటి లేదు అంటూ బైడెన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 2020 అధ్యక్ష ఎన్నికలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రంపు జార్జియాలోని ఫుల్టన్ కౌంటీ జైలుకు వెళ్లి లొంగిపోయిన విషయం తెలిసిందే. పోలీసు రికార్డుల కోసం ఆయన ఫొటో (మగ్‌షాట్) తీశారు. దీంతో మగ్‌షాట్ తీయించుకున్న తొలి మాజీ అధ్యక్షుడిగా ఆయన చరిత్ర సృష్టించారు. ఆయనకు ఖైదీ నంబర్ P01135809 కేటాయించారు. అరెస్టు అయిన 20 నిమిషాల అనంతరం 2 లక్షల డాలర్ల పూచీకత్తుపై ఆయన విడుదలయ్యారు.

## సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థికి మద్దతు ప్రకటించిన కాంగ్రెస్



లక్నో: ఉత్తరప్రదేశ్ లోని ఘోసిఅసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ప్రధాన విపక్ష పార్టీల మధ్య సయోధ్య నెలకొంది. ఈ నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధాకర్ సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ శనివారంనాడు మద్దతు ప్రకటించింది. ఘోసి నియోజకవర్గం నుంచి తమ అభ్యర్థిని నిలబెట్టరాదని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించడంతో పాటు ఎస్పీ అభ్యర్థికి మద్దతుగా నిలబడాలంటూ పార్టీ కార్యకర్తలను ఒక ప్రకటనలో కోరింది. ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ రాయ్ ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. "నేషనల్ డవలప్‌మెంట్ ఇంక్లూజివ్ అలయెన్స్ లో సమాజ్‌వాదీ పార్టీ భాగస్వామిగా ఉంది. ఆ కారణంగా 2023 సెప్టెంబర్ 5న జరిగే ఘోసి అసెంబ్లీ నియోజకవర్గంలో సమాజ్‌వాదీ పార్టీ తరఫున పోటీచేస్తున్న సుధాకర్ సింగ్‌కు కాంగ్రెస్ మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది. ఆయనకు కాంగ్రెస్ కార్యకర్తలు పూర్తిగా సహకరించి, ఆయనకు ఘనవిజయం అందించాలి" అని రాయ్ ఆ ప్రకటనలో కోరారు.

పొత్తేమీ కొత్త కాదు: బీజేపీ

కాగా, ఎస్పీ అభ్యర్థికి కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంపై బీజేపీ ఉపాధ్యక్షుడు విజయ్ బహదూర్ పాఠక్ స్పందించారు. ఆ రెండు పార్టీల మధ్య పొత్తు ఇప్పుడు కొత్తేమీకాదన్నారు. గతంలో రాయబరేలి, అమేథీలో సమాజ్‌వాదీ పార్టీ మద్దతుతో కాంగ్రెస్ గెలిచిందన్నారు. కచ్చితంగా ఈసారి పొత్తు 2024 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్నదేనని అన్నారు. అయితే, ఘోసితో పాటు రాష్ట్ర ప్రజలందరికీ బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వంపై గట్టి నమ్మకం ఉందని ఆయన ధీమా వ్యక్తం చేసారు. ఈ నియోజకవర్గం నుంచి దారా సింగ్ చౌహాన్‌ను తమ అభ్యర్థిగా బీజేపీ నిలబెట్టింది. ఆసక్తికరంగా ఘోసి నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన దారా సింగ్ చౌహాన్ గత జూలైలో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరారు. దాంతో ఆ సీటుకు ఉప ఎన్నిక అనివార్యం కాగా, ఇప్పుడు బీజేపీ టిక్కెట్‌పై తన నియోజవవర్గంలోనే ఆయన పోటీకి దిగారు.

## పీఎంకు ఎందుకు స్వాగతం చెప్పలేదంటే?... డీకే వివరణ



బెంగళూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బెంగళూరు పర్యటన సందర్భంగా ఆయనకు సిద్ధరామయ్య సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం స్వాగతం చెప్పలేదంటూ బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వివరణ ఇచ్చారు. తనను కలుసుకునేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, గవర్నర్ విమానాశ్రయానికి రావాల్సిన అవసరం లేదని రాష్ట్ర చీఫ్ సెక్రటరీకి పీఎంఓ నుంచి అధికారిక సమాచారం వచ్చిందన్నారు.

పీఎంకు సాదర స్వాగతం పలికేందుకు సిద్ధరామయ్య ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ పీఎంఓ సమాచారం మేరకు దూరంగా ఉన్నామని చెప్పారు.

"ప్రోటోకాల్ గురించి మాకు బాగా తెలుసు. ఎవర్ని ఎలా గౌరవించాలనే రాజకీయ పరిజ్ఞానం మాకు ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రయాన్–3 సక్సెస్‌పై శాస్త్రవేత్తలను అభినందించేందుకు మొదటిసారిగా కర్ణాటకకు ప్రధానమంత్రి వచ్చారు" అని డీకే తెలిపారు. పీఎంఓ కార్యాలయం నుంచి సమాచారాన్ని గౌరవించి తాము ప్రధానికి ఆహ్వానం పలికే కార్యక్రమానికి దూరంగా ఉన్నామని చెప్పారు.

పొలిటికల్ గేమ్ ముగిసిందని, ఇప్పుడు తామంతా రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించామని తెలిపారు.

కేపీసీసీ పునర్వవస్థీకరణ

కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ)ని పునర్వవస్థీకరించే ఆలోచన చేస్తున్నట్టు డీకే ఈ సందర్భంగా తెలిపారు. కేపీసీసీలోని చాలా మంది మంత్రులు కావడంతో కొత్త లీడర్లకు కేపీసీసీలో అవకాశం కల్పించాలని అనుకుంటున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఐదు హామీలు ఎలాంటి వివక్ష లేకుండా అన్ని కమ్యూనిటీలకు అందేలా చేశామన్నారు. కావేరీ జలాల విషయంలో కేంద్ర స్థాయిలో తాము జరుపుతున్న పోరాటానికి కలిసివచ్చే రాష్ట్ర ఎంపీలు, ఇతర పార్టీలను తాము స్వాగతిస్తామని చెప్పారు.

## 'గగన్‌యాన్'కు మహిళా రోబో : కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ : భారత దేశం గగన్‌యాన్ మిషన్ లో మహిళా రోబో వ్యోమమిత్ర ను అంతరిక్షానికి పంపిస్తుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. దీనికి సంబంధించిన ప్రయోగాత్మక పరీక్షలు అక్టోబరు మొదటి లేదా రెండో వారంలో జరుగుతాయని తెలిపారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన జీ20 కాంక్లేవ్‌లో శనివారం ఆయన ఈ వివరాలను తెలిపారు. కోవిడ్–19 మహమ్మారి వల్ల గగన్‌యాన్ కార్యక్రమం ఆలస్యమైందన్నారు. మొదటి ట్రయల్ మిషన్‌ను అక్టోబరు మొదటి లేదా రెండో వారంలో నిర్వహించేందుకు ప్రణాళిక రచిస్తున్నట్లు తెలిపారు. వ్యోమగాములను పంపించడం ఎంత ముఖ్యమో, వారిని తిరిగి తీసుకురావడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. రెండో మిషన్‌లో మహిళా రోబో ఉంటుందని చెప్పారు. ఆమె అన్ని మానవ కార్యకలాపాలను నిర్వహిస్తుందన్నారు. అంతా సవ్యంగా జరిగితే, మరింత ముందుకు వెళ్లవచ్చునని చెప్పారు.

# కవి సమయం

## మర్రిచెట్టు

ఊడలు నాటే మర్రిచెట్టులా!
ఎంతో ఘన చరిత్రగలది
కాంగ్రెస్‌పార్టీ
మహావృక్షంలా - వృక్షరాజు ఐ ఉంది
ఈ వృక్ష రాజుకు - చాపక్రింద నీరులా చేరి
అనతికాలంలో ప్రాంతీయ పార్టీలుగా వెలసిల్లే
రెండు నాలుకలతో మాట్లాడే నాగుపాములు
వాడి మీద, వీడు
వీడు మీద వాడు చాడీలు చెప్పుకొనే
దీపావళి టపాస్‌కాయలు
ఒక్కొక్క రాష్ట్రానికి
ఒక్కొక్క కళియుగరావణాసుడు గానో!
నరకాసురుడుగానో! తయారై
కాంగ్రెస్ ప్రగతిని - సుస్థిర స్థానాన్ని
భూస్థాపితం చెయ్యాలని చూస్తున్న
చీడపురుగులు
రాష్ట్రాన్ని - రంపపు కోతకోసి
మధ్య తరగతి కుటుంబీకులను
పీడించే - చండాలులు
వీరి మాటలు - చేష్టలు
విన్నా - కన్నా - చెడుగ ప్రవర్తించినా!
ప్రజాభిష్టంపై - భూస్థాపితం తధ్యం
ఈ సంక్షోభానికి కారకులెవ్వరు?
ఆ వెన్నుపోటు దారులెవ్వరు?
ఈ మధ్య తరగతి కుటుంబీకులను
ఆదుకున్న దెవ్వరు?
నువ్వేగదా! మర్రివిత్తువై ఇంతింతై
అంతై మర్రిచెట్టువై
నీ ఊడలు పెకిలించే నరకాసురులను
పథజర్పిన నాడే - నీ స్థానం - సుస్థిరం

రచయిత
యల్.సిద్ధూ

# పంచాంగం

మాసం : శ్రావణం : తిథి : ఏకాదశి సా. 5,17
పూర్వాషాఢ రా. 2.43 వ.మ. 1.01ల 2.32

ఆదివారం
27-08-2023

a **మేషం** : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది.

b **వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు.

c **మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది

d **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

e **సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయా ణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు.

f **కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

g **తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నవ ములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

h **వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

i **ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

j **మకరం** : ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సాను కూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు.

k **కుంభం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, అప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరా స్తుల కొనుగోలు యత్నాలు అను కూలిస్తాయి. మీ ఏమరుపాటుతనం, హడావుడి వల్ల వస్తువులు చేజార్చు కుంటారు. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలు దారు లను ఆకట్టు కుంటారు.

L **మీనం** : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్యరంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. ఇసుక, భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆటుపోట్లు తప్పవు.

# లలితా సహస్రనామం

సంకీర్తన



లలితా సహస్రనామ స్తోత్రం వ్యాస ప్రోక్తం కాదు. అది సాక్షాత్తు లలితాదేవి యొక్క అనుగ్రహం చేత ఆమె యొక్క ఆజ్ఞ చేత వశిన్యాది దేవతలు పలికితే ఈ స్తోత్రం ప్రచారం లోకి వచ్చింది. ఈ నామాలని ఎవరు అనుసంధానం చేస్తారో ఎవరు ప్రతిరోజు ఈ లలిత సహస్ర స్తోత్రాన్ని చదువుతూ ఉంటారో వారి యందు నాకు ప్రీతీ కలిగి వారికి సంబంధించిన సమస్త యోగక్షేమాలను తానే స్వయంగా విచారణ చేస్తాను అని అమ్మవారు ఆనాడు ప్రతిన పూనింది. కాబట్టి కలియుగంలో మనకి లలిత సహస్రనామం వంటి సహస్రనామ స్తోత్రం లభించడం కేవలం భగవంతుని యొక్క నిర్హేతుక కృపాకటాక్ష వీక్షణం తప్ప అన్యము కాదు. ఇది తల్లి యొక్క పూర్ణాను గ్రహముగా మనకు అందినటువంటి స్తోత్రం. నామము అంటే పేరు. లలితా సహస్రనామ స్తోత్రము అని ఒక మాట అంటున్నాం.....కానీ బాహ్యంలో అది రహస్య నామా స్తోత్రం అనే విషయాన్ని కాసేపు పక్కన పెట్టండి. లలితా సహస్రనామ స్తోత్రం అని అవసరం అవతుందా!!! ఆవిడ పేరు లలిత అయతే ఆవిడని సహస్రము అంటే అనంతము అని పేరు. అనంతము అంటే లెక్కపెట్టలేనన్ని. సహస్ర శీర్ష వాదనా సహస్రాక్షీ సహస్రపాత్ అంటే ఖచ్చితంగా లెక్కపెట్టడానికి 1000 తలకాయలు ఉన్నది అని కాదు దాని అర్థం. అనంతమైన తలలు కలిగినది అని. అనంతమైన నామములు ఎందుకు ఉండాలి?? ఒక రూపం ఏర్పడితే ఆ రూపాన్ని గుర్తుపట్టి పిలవడానికి ఒక నామం అవసరం.

**మనసుతో పలకాలి:** భగవంతుడు/భగవతి ఒక సాకారమును దాల్చింది. అది దేవతల అదృష్టం, దేవతల వలన మనం పొందిన అదృ ష్టం. ఒకవేళ అమ్మవారి దగ్గరకు వెళ్లి పేరు పెట్టి అదే పనిగా లలితా.....లలితా.....లలితా..... అన్నామనుకోండి మనకి ఆవిడ గురించి ఏమైనా తెలుస్తుందా!!! తెలియదు. అలా ఒక 1000 సార్లు లలితా.....లలితా.....లలితా..... అంటే ఏమైనా ఉపయోగం ఉంటుందా!!! లేకపోతే అమ్మవారికి కొన్ని పేర్లు చెప్తే ఏమైనా తెలుస్తుందా... అంటే ఇది లౌకికంగా పేర్లు పెట్టి పిలవడం కాదు స్తోత్రము. నామములు గౌనములు. లలితా సహస్రనామ స్తోత్రం చదవడం అంటే లలితా సహస్రనామ స్తోత్రం కొన్నాళ్ళకి నోటికి వచ్చేసి అప్పచెప్పేయడము కాదు. లలితా సహస్రనామ స్తోత్రం చదివేటప్పుడు ఒక్కొక్క నామం చెప్తున్నప్పుడు ఒక్కొక్క గుణం ప్రకాశించినటువంటి కారణం చేత మననస్సును హత్తుకుని నిలబడి పోవాలి.ఏదో ఒక నామం దగ్గర ఒంటి మీద వెంట్రుకలు నిక్కపోడుచుకుని కన్నుల నీరు వచ్చుఇమ్మా!! ఇంత దయ కలిగిన దానివా తల్లీ.....ఇన్ని గుణములా..... ఈ గుణములన్ని మమల్ని అనుగ్రహించడం కోసమని ప్రకాశించినటు వంటి గుణములా....లేకపోతే అసలు గుణముల యెక్క అవసరం అసలు నీకేంటి....నీవు గుణాతీతమైనటువంటి వ్యక్తివి....నీవు అటువంటి తల్లివి. గుణములను ప్రకాశించేటట్టుగా అవసరం ఇచ్చారు. పిల్లాడికి అజ్ఞానం లేకపోతే, మన్నిచేటటువంటి గుణం అమ్మదెలా ప్రకాశిస్తుంది. పిల్లాడికి అజ్ఞానం ఉంది కాబట్టే అమ్మ దగ్గర దయా అనే గుణం ప్రకాశించింది. పిల్లవాడి దగ్గర అవిద్య ఉందికాబట్టి అమ్మవారు వాడ్ని జ్ఞానమంతుడ్ని చేయగలిగి నటువంటి ఔదార్యము, అటువంటి శక్తి అమ్మవారి యందు ప్రకాశించింది.



# పిల్లలు అందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో వుండే విధంగా చర్యలు తీసుకోవాలి




కాకినాడ : బడిఈడు పిల్లలు అందరూ తప్పనిసరిగా పాఠశాలల్లో వుండే విధంగా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో జరుగుతున్న గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం కాకినాడ కలెక్టరేట్ లో విద్యా శాఖకు సంబంధించి గ్రాస్ ఎన్రోల్మెంట్, వాలంటీర్ల ఎడ్యుకేషన్ సర్వే, నాడు నేడు కింద చేపట్టిన పనులపై జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా..విద్యా శాఖ, ఇంటర్ మిడియట్, నైపుణ్య శిక్షణ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో చేపట్టిన విద్యార్థుల సర్వే పురోగతి, నైపుణ్య శిక్షణ తరగతుల వివరాలు ఇతర అంశాలపై ఎంపీడీవో, ఎంఈవోలతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ బడి బయట ఉన్న బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేరే విధంగా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఏ ఒక్క విద్యార్థి ఇంటికి పరిమితం కాకుండా తప్పనిసరిగా పాఠశాల/నైపుణ్య శిక్షణ కేంద్రాలలో ప్రవేశాలు కల్పించాలన్నారు. పదో తరగతి తప్పిన విద్యార్థులకు తిరిగి అదే తరగతి అభ్యసించేలా చూడాలన్నారు. ఇంటర్ తప్పిన విద్యార్థులను ఓపెన్ స్కూల్, నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా అందిస్తున్న కోర్సుల్లో ప్రవేశం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఈ శిక్షణ కేంద్రాల ద్వారా వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రాముఖ్యంగా జిల్లాలో జరుగుతున్న గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే రానున్న సెప్టెంబర్ నెల ఐదునాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. అదేవిధంగా వాలంటీర్ల సర్వే నూరు శాతం పూర్తి కావాలన్నారు. ఈ సర్వేలో మరణించిన, వలస వెళ్లిన తదితర విద్యార్థుల వివరాలను పునః పరిశీలించి యాప్ లో సక్రమంగా

నమోదు చేయాలన్నారు. ఇందుకు మండల విద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. సమావేశంలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ, జిల్లా విద్యాశాఖ అధికారి జీ.నాగమణి, ఆర్ఐవో ఎన్.ఎస్.వీ.ఎల్.నరసింహా, వికాస పీడీ కె లచ్చారావు, కాకినాడ ఐటీఐ ప్రిన్సిపల్ ఎంవీజీ.వర్మ, నైపుణ్య శిక్షణ అధికారి, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాలువపై తాత్కాలిక బాట ఎవరి కోసం?

## రియల్టర్లుకు ఇరిగేషన్ అధికారుల మద్దతు మాజీ ఎంపిటిసి పితాని ఆరోపణ



కాకినాడ రూరల్, ఆగస్ట్ 25: కాకినాడ జిల్లా ఇరిగేషన్ అధికారులు సామర్లకోట పంట కాలుపై వంతెన రియల్టర్ల కోసం సామర్లకోట కాలువపై కాలిబాటకు అనుమతులు ఇచ్చి ఎవరికి మేలు చేస్తున్నారో చెప్పాలని కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామ మాజీ ఎంపిటిసి పితాని వెంకట రాము డిమాండ్ చేశారు. ఈ కెనాల్ మీదుగా కాలిబాట నిర్మించి సుమారు 25 ఎకరాలలో భూమిని మట్టితో పూడ్చి అక్రమ అనుమతులను అధికారులు ఇచ్చారని రాము ఆరోపించారు. కాకినాడ నగరానికి చేర్చి వున్న ప్రాంతంలోనే రియల్ వ్యాపారులు ఇలా రెచ్చిపోతుంటే దూరంగా ఉన్న అక్రమార్కుల పని ఎలా ఉందో అర్థం చేసుకోవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ అక్రమాలపై రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కలగజేసుకోవాలని లేని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని రాము చెప్పారు.

# కొర్రా రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా పవన్ అన్న జన్మదిన వేడుకలు



అనంతగిరి, విజయభాను. న్యూస్, : అల్లూరీసీ తారామరాజు జిల్లా అనంతగిరి మండలం వచ్చేనెల వ తేదీన జనసేనాని కొణిదెల పవన్ కళ్యాణ్ 53 వ జన్మదిన వేడుకల సందర్బంగా అరకు నియోజకవర్గంలో నాయకులకు వీరమహిళలు, జనసైనికులకు అభిమానులకు ఆహ్వాన పత్రికలు అంద జేస్తున్నాము ఇదే మా ఆహ్వానమని అనంతగిరి మండలంలో జరగబోయే పవన్ అన్న జన్మదిన వేడుకలకు అందరు హాజరు కావాలని కోరుతున్నామని అనంతగిరి మండల జనసేనపార్టీ నాయకులన్నారు అదే విదంగా ఆరోజు క్రియాశీలక జనసైనికుడు కొర్ర రమేష్ మరియు ముఖ్యనాయకుల ఆధ్వర్యంలో బొర్ర గుహలు లో సుమారు 1500 మంది ప్రజలకు అన్నసంతర్పణ చేయబడును. వృద్ధులకు రగ్గులు పంపిణీ చేయాలని నిర్ణయించడమైనది. సేవాభావంతో సమజ హితం కోరే ప్రతి జనసైనికుడు తమ వంతు విధిగా పవన్ అన్నా జన్మదిన వేడుకలకు హాజరై తమవంతు సేవతత్పరతను సాటి చెప్పాలని, ఈ కార్యక్రమంలో మీ బాగస్వామ్యమే మా కృషికి పరమార్ధమని, జనసేనాని పవన్ కల్యాణ్ గారు ఆయురారోగ్యాలతో ఉండాలని అందుకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించదలిచామని అనంతగిరి మండల జనసేనపార్టీ నాయకులు తెలిపారులి. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు సిహెచ్ మురళి. కొర్రా ప్రవీణ్. శెట్టి చిన్న. మైలు. త్రినాధ్.జన సైనికులు మోటర్ ఫీల్డ్ యూనియన్ ప్రెసిడెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# వెనక్కి వెళ్లిన సముద్రుడు : మత్స్యకార పెద్దల్లో ఆందోళన

యు. కొత్తపల్లి (కాకినాడ) : ఎప్పుడూ అలల అలజడి చేస్తూ ఉండే ఉప్పాడ సముద్ర తీరం ఒక్కసారిగా వెనక్కి వెళ్లడంతో రానున్న రోజుల్లో విపత్తులు సంభవిస్తాయని మత్స్యకార పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం ఉప్పాడ, కాకినాడ తీర ప్రాంతపు సముద్రపు అలలు వెనక్కి వెళ్లాయి. సముద్రమంతా ఎలాంటి అలల అలజడి లేకుండా ప్రశాంత వాతావరణంలో ఉంది. నిన్న అర్ధరాత్రి నుంచి వాతావరణంలో మార్పులు సంభవించాయి. పలుచోట్ల వర్షం కురిసింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చల్లటి వాతావరణం ఏర్పడి, వర్షం కురుస్తున్నప్పటికీ సముద్రుడు మాత్రం ఎలాంటి అలల అలజడి చేయకుండా, సముద్రం వెనక్కి వెళ్లడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో ఎలాంటి విపత్తులు సంభవిస్తాయోనని మత్స్యకార పెద్దలు ఆందోళన చెందుతున్నారు.



# జార్జిపేట పంచాయతీ సర్పంచ్‌గా సత్యవేణి ప్రమాణ స్వీకారం

తాళ్లరేవు (కాకినాడ) : జార్జిపేట పంచాయతీ సర్పంచ్‌గా గుత్తుల సత్యవేణి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా శనివారం పంచాయతీలో కార్యదర్శి వరలక్ష్మి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి నూతన సర్పంచ్‌గా గుత్తుల సత్య వేణిచే అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయించారు. 8 వ వార్డు సభ్యురాలుగా పనిచేసిన సత్యవేణి ఆ పదవికి రాజీనామా చేసి సర్పంచ్‌గా అత్యధిక మెజార్టీతో ఎన్నికవడంతో వార్డు సభ్యులు చింతా భాగ్యలక్ష్మి, కే.వి.వి. సుబ్రహ్మణ్యం, గాలి దేవర సీతాదేవి, శీలి రాజు, రాయుడు సత్యనారాయణ, ఎంపీటీసీ మందపల్లి నాగమ్మ అభినందనలు తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో టిడిపి నాయకులు నూతన సర్పంచ్ సత్యవేణి, ఆమె భర్త సూరిబాబు ని పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడలి శ్రీనివాస్, పెంకె ఏడుకొండలు, పెదపాటి కామేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, మోపూరి వెంకటేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, బోయిడి వేణుగోపాల్, జనసేన పార్టీ మండల కన్వీనర్ అత్తిలి బాబురావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, వైసిపి నాయకులు మందపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ధళిత వాడల్లో కంపు కొడుతున్న డ్రైనేజీలు

## క్లీనింగ్ చేసేది ఎప్పుడు... బ్లీచింగ్ జరిగిన జాడలెక్కడ ..




అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం : మండలంలోని దళితవాడల్లో ఎమ్మెల్యే వస్తే తప్ప బ్లీచింగ్ జరిగిన జాడలు లేవని (డి ఎస్ పీ) దళిత సేవా పరిరక్షణ జిల్లా అధ్యక్షులు యాదగిరి దాసు ఆరోపించారు. శనివారం ఈ మేరకు రోలుగుంట ప్రత్యేక అధికారికి ఫిర్యాదు చేశారు గత మూడు సంవత్సరాల్లో 25 పంచాయతీల్లో ఎక్కడైనా ఒక్క డ్రైన్ అయినా నిర్మించారా...? అని అడిగారు. కనీసం కాలువల శుభ్రం చేసే, వాటర్ ట్యాంకులు పరిశుభ్రపరిచే పని కూడా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ అలా చేసి ఉంటే వాటి వివరాలను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎం అప్పలరాజు, దళిత పక్షపాతి బంటు రాజు తదితరులు పాల్గొన్నారు. ఇదే విషయమై గతంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని డివిఎంసి సభ్యులు ఎం అప్పలరాజు అన్నారు

# 28న వైసీపీ సీఈసి సభ్యులు పైలా జన్మదిన వేడుకలును జయప్రదం చేయండి

## నాయకులకు వైసీపీ అధ్యక్షులు కోన రామారావు పిలుపు



పరవాడ విజయభాను. న్యూస్, : 28 అనగా సోమ వారం ఉదయం 9గంటలకు పరవాడ గ్రామంలో వైసిపి రాష్ట్ర సిఈసి సభ్యులు పయిల శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని వైసీపీ మండల పార్టీ ప్రెసిడెంట్ రామారావు తెలిపారు.. ఈ పుట్టినరోజు వేడుకలకు ముఖ్య అతిధులుగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు మరియు పంచాయతీ రాజ్ శాఖామాత్యులు బూడి ముత్యాలనాయుడు ,రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు మరియు ఐటి శాఖామాత్యులు గుడివాడ అమర్నాథ్ , అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు బి.వి సత్యవతి విష్ణుమూర్తి ,పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ , శాసనమండలి సభ్యురాలు వరుదు కల్యాణి జిల్లా పార్టీ అధ్యక్షుడుబొడ్డేడ ప్రసాద్ విచ్చేసి కేక్ కటింగ్ కార్యక్రమం లో పాల్గొంటున్నారుఅన్నారు.

కావున పెందుర్తి నియోజకవర్గ పరిధిలో గల ఎంపీపీలు, జెడ్పీటీసీ లు,వైస్ ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు,పరవాడ మండలంలో గల పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ లు, పార్టీ నామినేటెడ్ పదవులలో వున్న నాయకులు మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీ లు కార్యకర్తలు,పార్టీ అనుబంధ కమిటీ అధ్యక్షులు సభ్యులు మహిళా కమిటి సభ్యులు పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు..

# 15లోగా భవన నిర్మాణాలు పూర్తి చేయాలి : కలెక్టర్

రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను సెప్టెంబర్ 15 లోపల పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీరాజ్ శాఖ ఇఇలు, డిఇలు, ఎఇలతో గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ గిరీష పిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలపై అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అధికారులు అందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ సచివాలయాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణంలో నిర్లక్ష్యం చూపకుండా అత్యంత ప్రమాణాలతో రూపుదిద్దు కొనేటట్లుచూడాలన్నారు. భవన నిర్మాణాలకు సంబంధించి రోజురోజుకూ పురోగతి కనిపించేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను పరిశీలించాలన్నారు. జరిగిన పనులకు బిల్లులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు వివిధ సేవలు అందిస్తుందని ప్రయివేట్ భవనాలలో ఉండే గ్రామ సచివాలయాలను ప్రభుత్వ భవనాలలోకి మార్చేందుకు సచివాలయ భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేస్తారని తెలిపారు. అధికారులు ఆర్‌బికెల భవన నిర్మాణాలలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. గ్రామాలలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ లు ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఈ భవన నిర్మాణాలకు ఎటువంటి సమస్య లేకుండా నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

# పరవాడ పీహెచ్సీలో నేత్రదాన పక్షోత్సవాలు



పరవాడ : జిల్లా అందత్వ నివారణ సంస్థ అనకాపల్లి డాక్టర్. రమణ కుమార్ ఆర్ వెంకట్రావు ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేత్ర దాన పక్షోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్. రంజిత్ మాట్లాడుతూ మానవునికి కంటి చూపు చాలా ముఖ్యమైనది. పౌష్టికాహారం లోపం, ఇన్ఫెక్షన్లు, కెమికల్ బర్న్, పుట్టుకతో వచ్చే లోపాలు, గాయాలు వలన మొదలగు కారణాల వల్ల కంటిచూపు పోగొట్టుకున్న వారికి నేత్రదానం చాలా అవసరం. మనిషి మరణాంతరం ఆరు గంటల లోపు కంటిలోని కార్నియా తీసి అమర్చుటను నేత్రదానం అంటారు. నేత్రదానం అన్ని దానాల్లోకెల్లా చాలా గొప్పది. ఎవరైనా మరణించినట్లు మీకు తెలిసినట్లయితే నేత్రదానం చేసేటట్లు ఆ కుటుంబానికి ప్రేరణ ఇచ్చే విధంగా ప్రయత్నం చేయాలి.

ఆ విధంగా మనం సమాజానికి సేవ చేయాలి. నేత్రదానం చేయువారు తమ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై పూర్తి అవగాహన ఏర్పర్చాలి నేత్రదానం చేసేవారు ముందుగా ఐ బ్యాంకు ఎల్. వి.ప్రసాద్, ఐ. ఇనిస్టిట్యూట్. హనుమంత వాక జంక్షన్, విశాఖపట్నం వారికి సమాచారం తెలియజేయాలని ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ హారిక, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆర్. వెంకటరావు సి. హెచ్. ఓ. ఎం. ఎస్ .ఎస్ .సాయిరాం, పీ.హెచ్.ఎన్. జానకిరామన్ యు. డి.సి ఆనంద్ కుమార్, స్టాఫ్ నర్స్ రాజేశ్వరి, హెచ్.వి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# టిడిపిలో చేరిన వైసిపి నేత పోలి సుబ్బారెడ్డి

రాజంపేట : రాజంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైసిపి నాయకులు పోలి సుబ్బారెడ్డి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. శనివారం విజయవాడలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. చిన్నిల్లుగారిపల్లెకు చెందిన సుబ్బారెడ్డి రాజంపేట వైసిపిలో ముఖ్యమైన నేతగా ఉంటూ పోలి తదితర గ్రామాల రాజకీయాలపై ప్రభావం చూపే వ్యక్తిగా ఉన్నారు. అలాంటి కీలకమైన నాయకుడు వైసిపిలో అసంతృప్తి కారణంగా ఇటీవల టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును కలవడంతో నియోజకవర్గంలో పెద్ద కలవరం రేగింది. వైసిపి పెద్దలు సుబ్బారెడ్డికి బుజ్జగింపులు కార్యక్రమాలు చేపట్టారు.

# చిన్నారులకు శాపం.. అటిజం!



మెడ నిలపటం, పాకటం, తప్పటడుగులు, అత్తతాతలు.. పిల్లల ఎదుగుదల క్రమంలో ప్రతిదీ ఒక పండేగ. వీటిలో ఏదైనా తేడా వచ్చినప్పుడు తల్లిదండ్రులు తేలికగానే గుర్తుపడతారు.. వెంటనే దృష్టిసారిస్తారు కూడా. కానీ ఈ గడపలన్నీ దాటి.. ప్రయాణం బాగానే సాగుతోందనుకుంటున్న తరుణం లో కూడా కొన్ని సమస్యలు ఉండొచ్చు. వీటిని గుర్తిం చటం అంత తేలిక కాదు. వాటిని పట్టుకోవటానికి కాస్త అవగాహన అవసరం. ఇలాంటి సమస్యల్లో ముఖ్యమైనదీ.. ఇప్పటి వరకూ పాశ్చాత్య దేశాల్లోనే ఎక్కువ అనుకుంటున్నదీ... సంపన్న వర్గాల్లోనే ఎక్కువ అనుకుంటున్నదీ.. మన దేశంలోనూ, అన్ని వర్గాల్లోనూ ఎక్కువేనని ఇప్పు డిప్పుడే స్పష్టంగా బయటపడు తున్నదీ... ఆటిజం! ఆటిజం భిన్న విభాగాలకు విస్తరిం చిన ఎదుగుదల సమస్య. దీన్నే పర్వేసి డెవలప్‌మెం టల్ డిసార్డర్స్ అంటారు. వీరందరిలోనూ కొన్ని రకాల లక్షణాలు ప్రత్యేకంగా కన బడతాయి. కొన్ని అంశాల్లో ఎదుగుదల అస్తవ్యస్తమవు తుంది. ముఖ్యంగా మూడు అంశాలను ప్రత్యేకంగా గమనించొచ్చు.

**ఇతరులతో కలవలేకపోతుండటం:** ఆటిజం పిల్లలు తోటి పిల్లలతో ఆడుకోవటానికి అంతగా ఇష్టపడరు. ఒంటరిగా ఆడుకోవటం, ఒంటరిగా గడపటం ఎక్కువ.

**భావవ్యక్తీకరణ లోపం:**

మాటలు రావటం జాప్యం కావచ్చు. వచ్చినా పూర్తిస్థాయిలో ఉండకపోవచ్చు. తమ అవసరాలను తీర్చుకునేందుకు వేలుపట్టుకుని అక్కడి వరకూ తీసుకువెళ్ళటం వంటివి చేస్తుంటారు.

**ప్రవర్తన లోపాలు:**

చేసిందే మళ్లీ మళ్లీ చేస్తుండటం, ఒకపనిని ఎప్పుడు చేసినా తిరిగి అలాగే చెయ్యాలని ప్రయత్నిస్తుం డటం... రోజూ తాము వాడే టాయిలెట్‌నే వాడతామం టారు. రెండోదానిలోకి వెళ్ళనని మొరాయిస్తుంటారు. కొందరు సంతోషం కలిగితే చేతులను కాళ్ళను పైకీ కిందికీ అదేపనిగా ఆడిస్తారు. మరి కొందరు సూదులు, గుండుపిన్నుల వంటి జేక రకం వస్తువులను సేకరిస్తుంటారు..... ఆటిజం పిల్లల్లో సాధారణంగా ఈ మూడు లక్షణలూ ఉంటాయి. కొందరిలో ఒకటిరెండు మాత్రమే ఎక్కువగా కనబడినా అన్ని లక్షణలూ ఏదో ఒక స్థాయిలో కనబడతాయి. అమెరికా డయాగ్నోస్టిక్ అండ్ స్టాటిస్టికల్ మాన్యువల్‌లో దీన్ని పర్వేసి డెవలప్‌మెంటల్ డిజార్డర్ కింద దీన్ని వర్గీకరించారు. ఈ లక్షణాలు ఆరంభమైన సమయం, తీవ్రత, క్షీణిస్తున్న తీరు తదితర అంశాలను బట్టి దీన్ని ప్రధానంగా 5 రకాలుగా విభజించారు.

**ఆటిస్టిక్ డిజార్డర్:**

ఎక్కువగా కనబడే ఆటిజం సమస్య ఇదే. దీన్ని చైల్డ్‌హుడ్ ఆటిజం అంటారు. ఇది ఆడ పిల్లల్లో కన్నా మగపిల్లల్లో ఎక్కువ. మున్ముందు వివరంగా చూద్దాం.

**రట్స్ డిజార్డర్:**

అరుదైన ఈ రకం ఆడపిల్లల్లో ఎక్కువగా కనబడుతుంది. దీని ప్రత్యేకతేమంటే.. పుట్టిన ఏడాది వరకూ పిల్లలు బాగానే ఉంటారుగానీ తర్వాత లక్షణాలు కనబడటం మొదలవుతుంది.

ఇవి రెండు మూడేళ్ళలోనే వేగంగా తీవ్రమవుతాయి. అప్పటికి వచ్చిన ఒకటిరెండు మాటలు కూడా తిరిగి వెనక్కి వెళ్లిపోతాయి. ఇది ముదిరే రకం (ప్రోగసి డిజార్డర్) కావటం వల్ల కొంతకాలానికి నాడీ సంబంధ సమస్య లూ ఆరంభమవుతాయి. సరిగా నడుము నిలపలేక పోతుండటం వంటివాటితో మొదలై మెల్లగా ఫిట్స్ కూడా వస్తాయి. సాధారణంగా వయసుతో పాటు పెర గాల్సిన తల వీరిలో చిన్నదవుతుంటుంది. చొంగ కారటం, చేతులుకాళ్లు జేక రకంగా ఆడిస్తుండటం, చేతులతో చప్పుళ్లు చేయటం వంటివి కనబడతాయి. యుక్తవయసుకు ముందే సమస్యలు బాగా ముదిరి వీరు బతికిబట్టకట్టటం కూడా కష్టమవుతుంటుంది.

**ఆస్పర్జెర్స్ డిజార్డర్:**

ఇది మగ పిల్లల్లో ఎక్కువ. సాధారణంగా ఆటిజం పిల్లల్లో మాటలు ఆలస్యంగా వస్తుంటాయి. కానీ ఈ రకంలో మాటలు మామూలుగానే ఉంటాయి. నలుగురిలోకి వెళ్ళటం, తెలివి తేటలు కూడా బాగానే ఉంటాయి. కానీ తక్కువగా మాట్లాడతారు. అడిగిన దానికి సమాధానం చెప్పేసి ఆపేస్తారు. శరీరాకృతి భిన్నంగా ఉంటుంది. పొడుగ్గా ఉంటారు. పొడవైన ముంతో పాటు చెవులూ భిన్నంగా ఉంటాయి. మిగతా ఆటిజం పిల్లలతో పోలిస్తే ఇతరులతో బాగానే కలు స్తారు కాబట్టి వీరిలో భాషా నైపుణ్యాలు కాస్త ఎక్కువ గానే అలవడతాయి. కొంతవరకూ బాగానే చదువు తారు. కొన్ని పనుల్లో ఎక్కువ శ్రద్ధ చూపిస్తారు.

# పిత్తాశయంలో రాళ్ళు తొలగించే నేచురల్ ఫుడ్స్



ప్రస్తుత రోజులో గాల్ స్టోన్స్(పిత్తాశయంలోరాళ్ళు) ఒక సాధారణ సమస్యగా ఉంది. అదృష్టవశాత్తూ, గాల్ స్టోన్ నివారించుకోవండానికి కొన్ని హోం రెమెడీస్ ఉన్నాయి. ఈ గాల్ బ్లాడర్ అనేది చిన్న అవయం లివర్ కు వెనుకభాగంలో ఉంటుంది. పిత్తాశయం అనేది ఒక సంచి వంటి నిర్మాణం. ఇది కాలేయం కింది భాగంలో ఉంటుంది. ఆహారం అరుగుదలకు ఉపయోగపడే స్రావాలను నిల్వ ఉంచుతుంది. ఇవి కాలేయం నుండి స్రవిస్తాయి. పిత్తాశయంలో రాళ్లు అనేవి కొలెస్ట్రాల్, పిగ్మెంట్స్‌వల్ల ఏర్పడిన ఘనపదార్థాలు. ఇవి సన్నని ఇసుకు రేణువు పరిమాణం నుండి గోల్ఫ్‌బాల్ పరిమాణంలోగానీ, గుండ్రంగాగానీ, నున్నగాగానీ ఉండవచ్చు. వీటికి చికిత్స తీసుకోకపోతే తీవ్ర పరిణామాలకు దారి తీయవచ్చు. కొన్నిసార్లు ప్రాణాంతకం కావచ్చు. కొన్ని సందర్భాల్లో కొలెస్ట్రాల్, బిలిరుబిన్ మరియు బైల్ సాల్ట్ ల కారణంగా గాల్ బ్లాడర్లో స్టోన్స్ ఏర్పడుతాయి . 80 శాతం గాల్ స్టోన్స్ కొలెస్ట్రాల్ వల్లే ఏర్పడుతాయి. ముఖ్యంగా ఇవి కొద్దిగా ఘనంగా ఏర్పడుతాయి. గాల్ బ్లాడర్ లో ఏర్పడే గాల్ స్టోన్స్ చాలా పెద్దగా లేదా చాలా చిన్నది గాను ఉంటుంది . గాల్ బ్లాడర్ లో ఒక్కసారిగా స్టోన్స్ ఏర్పడినప్పుడు, ఒక్కసారిగా పిత్తప్రవాహాన్ని నిరోధిస్తుంది అలాంటి పరిస్థితుల్లో నొప్పి, కాలేయం లేదా క్లోమపు వాపుకు దారితీస్తుంది. గాల్ బ్లాడర్లో రాళ్ళు ఏర్పడినప్పుడు పొట్ట ఉబ్బరం, తేన్పులు, ఎసిడిటి, అరుగుదల లేకపోవ డం వంటి లక్షణాలతో ఇబ్బందిపడుతున్నారా? అయితే పిత్తాశయంలో రాళ్లు (గాల్‌స్టోన్స్) ఉండవచ్చని అనుమానించవచ్చు. ఎందుకంటే ఈ లక్షణాలు ఉదర సంబంధ వ్యాధికి సంబంధించినవి కావచ్చు. పిత్తాశ యంలో రాళ్లు ఉన్నప్పుడు కనబడే లక్షణాలు కావ చ్చు. ఉదరభాగం కుడివైపు నొప్పి, పొట్ట ఉబ్బరంగా ఉండటం, ముఖ్యంగా కొవ్వు పదార్థాలు ఆహారంలో తీసుకున్నప్పుడు, గాల్‌స్టోన్స్ ఏర్పడినప్పుడు సంభ విస్తుంది. దీనిని వైద్య పరిభాషలో 'కొలి లిథియాసిస్' అని అంటారు. గాల్ బ్లాడర్ లో స్టోన్ ఏర్పడితే, అకస్మాత్ గా నొప్పి ముఖ్యంగా పొట్ట ఉదయం కుడి వైపు, బ్యాక్ పెయిన్, వికారం లేద వాంతులు, కడుపు ఉబ్బరం, అజీర్తీ, చలి వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. =జూ్యా మీ=జు: పిత్తాశయంలో రాళ్ళను సహజంగా తొలగించడం ఎలా ? ఇలాంటి పరిస్థితిలో సరైన జీవనశైలిని మెయింటైన్ చేయకపోతే గాల్ స్టోన్ ఏర్పడే అవకాశం ఉంది. గాల్ స్టోన్ ప్రభావం వల్ల ఊబకాయం, డయాబెటిస్, లివర్ డిసీజ్, గర్భధారణ, సరైన జీవనశైలిపాటించకపోడం ఎక్కువ ఫాట్ ఉన్న ఆహారాలు తీసుకోవడం, అనీమియా గాల్ స్టోన్ ప్రమాధాన్ని కలిగిస్తుంది. గాల్ స్టోన్స్ నివారించే కొన్ని ఉత్తమ నేచురల్ ఫుడ్స్ ఈ క్రింది విధంగా...

**గాల్స్ స్టోన్స్ ను తొలగించే బెస్ట్ నేచురల్ ఫుడ్స్ పీయర్స్ (బేరి పండ్లు):** పీయర్స్ లో ఉండే పెక్టిన్ అనే కాంపౌడ్ గాల్ స్టోన్ కొలెస్ట్రాల్ ను పాస్ట్ చేసేందుకు సహాయపడుతుంది, కాబట్టి, ఇవి శరీరం నుండి బయటకు నెట్టివేయడానికి గ్రేట్ గా సహాయపడు తుంది. ఇంకా గాల్ స్టోన్ ద్వారా వచ్చే నొప్పిని మరియు ఇతర లక్షణాలను నివారిస్తుంది.

**ఆముదం:** గాల్ స్టోన్ నివారిస్తుంది మరియు గాల్ స్టోన్స్ ను తగ్గించడంలో సహాయపడుతుంది. ఆముదం లో యాంటీఇన్ఫ్లమేటరీ లక్షణాలు నొప్పిని తగ్గిస్తాయి. ఆముదంలో వ్యాధినిధోకతను పెంచే శోషరస వ్యవస్థ సానుకూల ప్రభావం కలిగి ఉంటుంది. కాస్ట్రాల్ ఆయిల్ తో మసాజ్ చేస్తే నొప్పి తగ్గించుకోవచ్చు.

**నిమ్మరసం:** నిమ్మరసం సిట్రస్ ఫ్రూట్ గాల్ బ్లాడర్ లో కొవ్వు చేరకుండా సహాయపడుతుంది. దాంతో గాల్ స్టోను ఏర్పడకుండా నివారిస్తుంది. లెమన్ జ్యూస్ ను రోజుకు మూడు సార్లు తీసుకోవచ్చు.

**విటమిన్ సి:** విటమిన్ సి బైల్ యాసిడ్స్, ను కొలెస్టాల్ గా మార్చేందుకు సహాయపడుతుంది. తద్వారా గాల్ స్టోన్ కరిగించబడుతుంది అందుకు మీరు విటమిన్ సి సప్లిమెంట్ లేదా విటమిన్ సి అధికంగా ఉండే ఆరెంజ్, టమోటో వంటి సిట్రస్ పండ్లను ఎక్కువగా తీసుకోవడం వల్ల గాల్ స్టోన్ నొప్పిని తగ్గించుకోవచ్చు.

**పెప్పర్మింట్ టీ:** పుదీనా ఇది బైల్ ఫ్లోను మరియు డైజెస్టివ్ జ్యూస్ ను ఉత్పత్తి చేయడంలో ఉత్తేజ పరుస్తుంది. ఇందులో ఉండే టెర్పెన్ అనే కాంపౌడ్ గాల్ స్టోన్ ను చాలా ఎఫెక్టివ్ గా కరిగిస్తుంది. మరియు ఇది కూడా పిత్తాశయ నొప్పి మరియు దుస్సంకోచాలు విశ్రాంతి కలిగించి ఉపశమనానికి సహాయపడుతుంది. ఈ ఆకులను ఉడికించి పిప్పర్ మెంట్ టీ తయారుచేయవచ్చు.

**బీట్ రూట్, పీర్, మరియు ఆపిల్ జ్యూస్:** గాల్ స్టోన్ నివారించుకోవడంలో ఒక ఎఫెక్టివ్ నేచురల్ హోం రెమెడీ. పచ్చి బీట్ రూట్ జ్యూస్, పీర్, మరియు ఆపిల్ జ్యూస్ వంటివి లివర్ ను శుభ్రపరుస్తుంది. గాల్ స్టోన్ నివారిచడానాకి ఈ మూడింటి మిశ్రమంతో జ్యూస్ చేసి త్రాగాలి.

## గొంతు నొప్పి నుండి ఉపశమనం కలిగించే.. ఉత్తమ ఇంటి చిట్కాలు

గొంతు నొప్పితో బాధపడుతున్నట్లైతే వెంటనే మనం ఉప్పు నీటితో మరీ గోరువెచ్చని నీటితో గార్లింగ్ చేస్తుంటాము. ఇది కేవలం సోర్ త్రోట్ (గొంత నొప్పి) నుండి ఉపశమనం కలిగించే హోం రెమెడీ ఇది ఒక్కటే అనుకుంటారు. కానీ గొంతు నొప్పి నుండి ఉపశమనం కలిగించే హోం రెమెడీస్ అనేకం ఉన్నాయి. అవి కూడా. ముఖ్యంగా ఈక్రింది లిస్ట్‌లో తెలిపిన 7 బెస్ట్ నేచురల్ సోర్ థ్రోట్ రెడీస్ ను పరిశీలించండి. ఈ హోం రెమెడీస్ చాలా సింపుల్ గా ఉంటాయి . కానీ చాలా ఎఫెక్టివ్ గా పనిచేస్తాయి.

**గొంతు నొప్పి నుండి**
**తక్షణ ఉపశమనం కలిగించే విటమిన్స్ ఫుడ్స్**

గొంతు నొప్పితో బాధపడే ఈ హోం రెమెడిస్ కంటే మరింత వేగంగా మరే ఇతర మెడిసిన్స్ పనిచేయవు. చాలా ఎఫెక్టివ్ గా వేగంగా గొంతు నొప్పిని నివారిస్తాయి కొన్ని మందులు ప్రస్తుతానికి ఉపశమనం కలిగించినా మాత్రలు నిలిపేస్తే తిరిగి పునరావృతం అవుతుంది. కానీ ఈ హోం రెమెడీస్ ద్వారా గొంతు నొప్పి మరియు ఇన్ఫెక్షన్ నుండి త్వరగా ఉపశమనం కలిగిస్తుంది.

**ఈ జ్యూసులతో జలుబు, గొంతు నొప్పి మటు మాయం**

గార్గిలింగ్ ద్వారా గొంతు నొప్పి, క్రిములను నాశనం చేయవచ్చు. మరియు గొంత నొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు. మరి దీంతో పాటు మరొకొన్ని ఎఫెక్టివ్ హోం రెమెడీస్ ఈ క్రింది విధంగా...

**లెమన్ వాటర్:** హోం మేడ్ సోర్ థ్రోట్ హోం రెమెడీ. ఒక గ్లాసు నీళ్ళలో నిమ్మరసం మిక్స్ చేసి బాగా మిక్స్ చేయాలి. ఈ ఆస్ట్రిజెంట్ జ్యూస్ గొంత వాపును తగ్గి స్తుంది మరయిు వైరస్ మరియు బ్యాక్టీరియాను గొంతులో చేరకుండా నిరోధిస్తుంది . అయితే ఎక్కువ నిమ్మరసం వేయకుండా చాలా తక్కువగా మిక్స్ చేసుకోవాలి.

**టమోటో జ్యూస్:** గొంతు నొప్పి నుండి తక్షణం ఉపశమనం పొందాలనుకుంటే, దీన్ని త్రాగవచ్చు. హాట్ వాటర్ మరియు టమోటో జ్యూస్ ను సమంగా తీసుకొని త్రాగాలి. ఇందులో కొద్దిగా పెప్పర్ సాస్ మిక్స్ చేసి త్రాగవచ్చు లేదా గార్గిలింగ్ చేయవచ్చు. ఈ మిశ్రమం గొంతు నొప్పి నివారించడంలో గ్రేట్ గా సహాయపడుతుంది. **అల్లం, తేనె, మరియు లెమన్ వాటర్:** గొంతు నొప్పి నివారించడానికి ఒక ఎఫెక్టివ్ హోం రెమెడీ. ఇది అల్లం మరియు తేనెను వేడి నీటిలో మిక్స్ చేసి గార్గిలింగ్ చేయాలి. ఈ నీటిని నోట్లో పోసుకొని గార్గిలింగ్ చేయడం వల్ల తక్షణ ఉపశమనం కలిగిస్తుంది.

**పసుపు మరియు వాటర్:** ఇంట్లో పొడి చేసుకొన్న పసుపులో అనేక బ్యూటీ అండ్ హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయి. పసులో యాంటీ బ్యాక్టీరియల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. మరియు యాంటీ యాక్సిడెంట్స్ లక్షణాలు అనేక వ్యాధులతో పోరాడే లక్షణాలు కలిగి ఉన్నాయి. కాబట్టి ఒకటీస్పూన్ పసుపు గోరువెచ్చని ఒక గ్లాసు నీళ్ళలో మిక్స్ చేసి గార్గిలింగ్ చేయడం లేదా గోరువెచ్చగా త్రాగడం వల్ల తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. గొంతు నొప్పికి ఇది ఒక బెస్ట్ హోం రెమెడీ.

**లవంగాల టీ:** వేడి నీటిలో ఒక టీస్పూన్ లవంగాలపొడి వేసి బాగా మిక్స్ చేసి నోట్లో పోసుకుని గార్గిలింగ్ చేయాలి. లవంగాల టీలో యాంటీ బ్యాక్టీరి యల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి గొంత నొప్పి నుండి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది.

**గ్రీన్ టీ:** బరువు తగ్గిచడంతో పాటు వ్యాధినిరో ధకతను పెంచి మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందించే మ్యాజికల్ టీ గ్రీన్ టీ. గోరువెచ్చని గ్రీన్ టీ గొంత నొప్పి నుండి ఉపశమనం కలిగించడంతో పాటు బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది.

**హాట్ సాస్ మరియు వాటర్:** హాట్ సాస్ పేరు వింటే కొద్దిగా భయం వేస్తుంది. కానీ చాలా ఎఫెక్టివ్ గా వెంటనే ఉపశమనం కలిగిస్తుంది. తక్షణ ఉపశమనం పొందడానికి కేయాన్ పెప్పర్ సాస్ ను హాట్ వాటర్లో మిక్స్ చేసి గార్గిలింగ్ చేయడం లేదా గోరువెచ్చగా త్రాగడం వల్ల కూడా వెంటనే ఉపశమనం కలిగిస్తుంది. ఇది నొప్పిని మరియు ఇన్ఫ్లమేషన్ ను తగ్గిస్తుంది.

## శీతాకాలంలో క్యారెట్లతో చర్మ సంరక్షణ ఇలా..!



శీతాకాలంలో సహజంగానే ఎవరి చర్మం అయినా పగులుతుంటుంది. చర్మం పొడిగా మారి కొందరికి దురద కూడా వస్తుంటుంది. అయితే శీతాకాలంలో చర్మాన్ని మృదువుగా, తేమగా ఉంచుకోవాలంటే అందుకు క్యారెట్ ఎంతగానో పనిచేస్తుంది. దాంతో చర్మాన్ని ఎలా సంరక్షించుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. క్యారెట్ సగం ముక్క తీసుకుని దాన్ని తురుం పట్టి మిక్సీలో వేసి పేస్ట్ చేసుకోవాలి. ఆ మిశ్రమంలో ఒక టీస్పూన్ తేనె, ఒక టీస్పూన్ పాలు వేసి బాగా కలిపి చర్మానికి రాయాలి. 15 నిమిషాల తరువాత చల్లని నీటితో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం తేమగా మారుతుంది. పగలకుండా ఉంటుంది. దీన్ని ముఖానికి ఫేస్ ప్యాక్‌గా కూడా వేసుకోవచ్చు. ఆయిలీ స్కిన్ ఉన్నవారికి కూడా క్యారెట్లు ఎంతో మేలు చేస్తాయి. చర్మం నుంచి విడుదలయ్యే నూనెలాంటి ద్రవాన్ని క్యారెట్లలో ఉండే విటమిన్ ఎ బయటకు పంపుతుంది. దీంతో చర్మం మృదువుగా మారుతుంది. క్యారెట్ జ్యూస్ ఒక కప్పు తీసుకుని అందులో పెరుగు, శనగపిండి, నిమ్మరసంలను ఒక్కో టేబుల్ స్పూన్ చొప్పున వేసి బాగా కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు ప్యాక్‌గా వేసుకోవాలి. 30 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే ఆయిలీ స్కిన్ నుంచి విముక్తి పొందవచ్చు. క్యారెట్ జ్యూస్, పెరుగు, ఎగ్ వైట్‌లను సమపాళ్లలో కలిపి మిశ్రమంగా చేసి దాన్ని ముఖానికి రాసుకుని 15 నిమిషాలు ఆగాక గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. దీంతో చర్మంపై ఉండే డెడ్ స్కిన్ సెల్స్ తొలగిపోతాయి. చర్మం తాజాగా మారుతుంది. ముఖ సౌందర్యం పెరుగుతుంది.

# తేనె చేసే మేలు



తేనె చేసే మంచి అంతా ఇంతా కాదు. అందాన్నీ, ఆరోగ్యాన్నీ పెంచడంలో తేనె కీలకపాత్ర పోషిస్తుంది. అందుకే దీనిని రకరకాలుగా ఉపయోగిస్తుంటారు. అజీర్తి, నోటి దుర్వాసన వంటి సమస్యలకు తేనె మంచి పరిష్కారం.

తేనెకు కొవ్వును కరిగించే గుణం ఉంది. ప్రతి ఉదయం ఒక గ్లాసెడు గోరువెచ్చని నీళ్లలో కాసింత తేనె కలుపుకొని తాగితే జీవక్రియలు సాఫీగా సాగుతాయి. ఒంట్లో వేడి తగ్గుతుంది.

తేనె కలిపిన నీరు తీసుకోవడం వల్ల గొంతులోని కఫం తగ్గుతుంది. జలుబు, దగ్గు ఉపశమిస్తాయి. అల్లం ముక్కను తేనెలో బాగా నానబెట్టి తింటే అజీర్తి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. చిన్న గ్లాసెడు నీళ్లలో అర టీస్పూన్ తేనె కలిపి పుక్కిలిస్తే నోటిలోని సూక్ష్మక్రిములు తొలగిపోతాయి. నోరు దుర్వాసన రాకుండా ఉంటుంది. అయితే.. బాగా ఎండలో తిరిగొచ్చిన తర్వాత, వ్యాయామం చేశాక తేనె తీసుకోకూడదు.

# నడుం నొప్పికి కారణాలు చికిత్సా విధానాలు

నడుం నొప్పి రెండు రకాలు..ఒకటి, అక్యుట్ లో బ్యాక్ పెయిన్ రెండు, క్రానిక్ లో బ్యాక్ పెయిన్.

క్రానిక్ బ్యాక్ పెయిన్ : నడుం నొప్పి మూడు నెలల కన్నా ఎక్కువ కాలం ఉంటే, దాన్ని 'దీర్ఘకాలిక నడుం నొప్పి' అంటారు. ప్రపంచ వ్యాప్తంగా, మనిషి వైకల్యానికి ఇది రెండో సాధారణ కారణం. ఈ సమస్య చాలామందికి వస్తుంది, వయసు పెరుగుతున్న కొద్దీ పెరుగుతుంది. వ్యక్తి జీవన విధానం మీదా, వృత్తి ఉద్యోగాల మీదా తీవ్ర ప్రభావం చూపుతుంది.

నడుం నొప్పి వివిధ కారణాలవల్ల వస్తుంది.

1. యాక్సిడెంట్స్, వెన్నుపూసకు గాయాలు, ఫ్రాక్చర్స్.
2. కండరాల స్ప్రెయిన్.
3. క్షయ వ్యాధి.
4. స్పాండిలైటిస్.
5. మానసిక ఒత్తిడి, డిప్రెషన్.
6. వెన్నుపూస ఎముకలు జారడం.

1. ప్రమాదాలతో వచ్చే నడుం నొప్పి

ప్రమాదాల్లో బలమైన దెబ్బ తగలడం వల్ల లేదా చాలా బరువైన వస్తువులను ఎత్తడం వల్ల కండరాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో.. వెన్నుపూస ఎముకలు విరగడం, వెన్ను మధ్యలోని జెల్ లాంటి డిస్కు బయటకు రావడం కూడా జరుగుతుంది.

2. ఇతర వ్యాధులతో వచ్చే నడుం నొప్పి

క్షయవ్యాధి : వెన్నుపూస ఎముకలకు క్షయ సోకడం, అవి చీము పట్టడం జరుగుతుంది. దానివల్ల వెన్నుపూస ఎముకలు అరగడం, దెబ్బతినడం జరుగుతుంది.



క్యాన్సర్: ఊపిరితిత్తుల క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ వెన్నుపూసకు సోకినప్పుడు, వెన్నుపూస ఎముకలు ఫ్రాక్చర్ అవుతాయి.

3. వయసుతో వచ్చే నడుం నొప్పి: దీర్ఘకాలంగా బరువైన పనులు చేసే భవన నిర్మాణ కూలీలకు, శ్రామికులకు వెన్నుపూస, డిస్క్ అరిగే ఆస్కారం ఎక్కువ. దీనివల్ల కూడా నడుం నొప్పి వస్తుంది.

4. డిస్క్ ప్రొలాప్స్ వల్ల వచ్చే నడుం నొప్పి: నడుం నుంచి, తొడ వెనుక భాగం నుంచి.. అరికాలు పాదం వరకూ నొప్పి వస్తుంది. దీన్ని 'సయాటికా' అంటారు. డిస్క్ ప్రొలాప్స్ అరగడం, వెన్నుపూస నరాల ఒత్తిడి వల్ల జరుగుతుంది.

5. రోడ్డు ప్రమాదాలవల్ల వచ్చే నడుం నొప్పి: ఈ సమస్యతో బాధపడుతున్నవారిని విపరీతమైన నొప్పి వేధిస్తుంది. కాళ్లు కదల్చలేకపోవడం కూడా ఉంటుంది.

6. క్షయవ్యాధివల్ల వచ్చే నడుం నొప్పి: కండరాలు బాగా పట్టేసి ఉంటాయి. విపరీతమైన నొప్పి ఉంటుంది.

నిర్ధారణజి

ఎంఆర్ఐ లుంబార్ స్పైన్/ సీటీ లుంబార్ స్కాన్ చేసి వ్యాధి ఎక్కడ ఉందో, దేనివల్ల నొప్పి వస్తుందో కనుక్కోవచ్చు.

ట్రీట్‌మెంట్ : నడుం నొప్పికి చాలా కారణాలు ఉంటాయి. దాన్ని బట్టి ట్రీట్‌మెంట్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. సమస్య మూలాన్ని కనిపెట్టి, దానికి తగిన ట్రీట్‌మెంట్ ఇచ్చినట్లయితే, నొప్పిని చాలావరకూ తగ్గించవచ్చు.

కన్జర్వేటివ్ థెరపీ : మందులతో చేసే ట్రీట్‌మెంట్ ఇది.

సయాటికా : డిస్క్ పొల్రాప్స్‌లో ఇచ్చే ట్రీట్‌మెంట్.

బెడ్ రెస్ట్ : మొదట అందరికీ సాధారణంగా బెడ్‌రెస్ట్ సూచిస్తాం. దీని వల్ల రోజూ చేసే పనులకు దూరంగా ఉండటం, బరువులు ఎత్తకుండా ఉండటం వల్ల నడుం నొప్పి చాలా వరకూ తగ్గుతుంది. తర్వాత ఫిజియోథెరపీ. ఇందులో హాట్ ప్యాక్స్, అల్ట్రాసౌండ్ థెరపీ ఉంటాయి. కొంచెం నొప్పి తగ్గిన తర్వాత కండరాల నొప్పి తగ్గడానికి ఎక్సర్‌సైజ్ థెరపీని సూచిస్తాం.

సర్జికల్ ట్రీట్‌మెంట్ : వ్యాధి తీవ్రతనుబట్టి సర్జరీ చేయించుకోవాల్సి ఉంటుంది. క్షయ, క్యాన్సర్ ట్యూమర్స్, వెన్నుపూస ఎముకలు జరగడం, ఫ్రాక్చర్.. వీటికి సర్జరీతో ట్రీట్ చేస్తాం.

సైకలాజికల్ ట్రీట్‌మెంట్ : మానసిక, ఒత్తిడి, డిప్రెషన్‌వల్ల వచ్చే నడుం నొప్పికి సైకలాజికల్ కౌన్సెలింగ్ అవసరం ఉంటుంది.

# పిఓఎస్ మిషన్స్ వినియోగంపై సచివాలయ ఎడ్మిన్ కార్యదర్శులకు శిక్షణ



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : పిఓఎస్ మిషన్స్ వినియోగంపై జివిఎంసి రెవిన్యూ అధికారులకు, సచివాలయ ఎడ్మిన్ కార్యదర్శులకు శనివారం వియంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనా థియేటర్లో జివిఎంసి కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ఐడిబిఐ బ్యాంకు జిల్లా అధికారులు, రీజనల్ అధికారులు ఆధ్వర్యంలో జివిఎంసి అదనపు కమిషనర్లు ఎస్ ఎస్ వర్మ, డాక్టర్ వి సన్యాసిరావు, డిసి(రెవెన్యూ) ఫణిరాం పర్యవేక్షణలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఎడ్మిన్ కార్యదర్శులకు పిఓఎస్ యంత్రాలు ఉపయోగించడం పై బ్యాంకు అధికారులు శిక్షణ ఇచ్చారు. ప్రజలకు సులభంగా జివిఎంసికి సంబంధించి అన్ని రకాల పన్నులు, నీటి చార్జీలు తో పాటు ఇతర అన్ని చార్జీలను చెల్లించేందుకు ఈ యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయని, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పిఓఎస్ యంత్రాలను ప్రజల వద్దకే నేరుగా తీసుకువెళ్లి వివిధ పన్నులు వసూలు చేయవచ్చని, దీని ద్వారా ప్రజలకు సమయభావన తోపాటు జివిఎంసి జోనల్ కార్యాలయాలు ప్రధాన కార్యాలయంలో ఉన్న సౌకర్య కేంద్రాలకు తిరగ కుండానే తమ పరిధిలో ఉన్న సచివాలయాలలో మొత్తం 25 రకాల పన్నులు, చార్జీలు చెల్లించవచ్చు అని అన్నారు. ఈ యంత్రాలు ఉపయోగంపై ప్రతి కార్యదర్శి పూర్తి అవగాహన కలిగి ఉండాలని బ్యాంక్ అధికారులు తెలియజేశారు. ఈ శిక్షణ తరగతులు జివిఎంసి జోనల్ కమిషనర్లు, రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



# నేడే ఏపీఎల్ తుది సమరం

- ముఖ్య అతథులుగా 83 వరల్డ్ కప్ హీరోలు
- ఏపీఎల్ ముగింపునకు కృషమాచారి శ్రీకాంత్, మదన్ లాల్
- యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకే ఏపీఎల్
- ఏసీఏ ప్లాటినం వేడుకలకు ముఖ్య అతిథిగా బిసిసిఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ
- ఎసిఎ కార్యదర్శి ఎస్.ఆర్. గోపినాథ్ రెడ్డి వెల్లడి



మధురవాడ (విజయభాను న్యూస్) : ఏపీఎల్, ఎసిఎ ప్లాటినం జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఎసిఎ కార్యదర్శి ఎస్.ఆర్. గోపినాథ్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా 83 వరల్డ్ హీరోలు రానున్నట్లు తెలిపారు. శనివారం మహా విశాఖ 6 వ వార్డు పరిధి ఏసీఏ-విడిసిఏ క్రికెట్ స్టేడియంలో ఎసిఎ జాయింట్ సెక్రటరీ రాకేశ్ తో కలిసి ఎస్. ఆర్ . గోపినాథ్ రెడ్డి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఏసీఏ అధ్యక్షులు పి. శరత్ చంద్రా రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని యువ క్రికెటర్ల లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఏపీఎల్ ఎంతో దోహద పడుతుందని అన్నారు. ఆదివారం విశాఖ స్టేడియంలో జరగనున్న ఏపీఎల్ ఫైనల్ కు మాజీ ఇండియా టెస్ట్ కెప్టెన్, బిసిసిఐ సీనియర్ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణమా చారి శ్రీకాంత్, అదేవిధంగా గౌరవ అతిథిగా మాజీ ఇండియా క్రికెటర్, ఇండియా నేషనల్ క్రికెట్ కోచ్ మదన్ లాల్ హాజరవుతారని వెల్లడించారు. ఏపీఎల్ ఫైనల్ మ్యాచ్ ను చూసేందుకు ఐపిఎల్ టీం స్కౌట్స్ వచ్చారని, దీంతో యువ క్రీడాకారులకు భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. అలాగే సోమవారం జరగనున్న ఏసీఏ ప్లాటినం జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా బిసిసిఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ, గౌరవ అతిథిగా మదన్ లాల్ హాజరు అవుతారని తెలిపారు. ముందుగా పైలాన్ను ఆవిష్కహరించి అనంతరం రంజీ క్రీడాకారులు, ఏసీఏ సిబ్బందితో ఆయన ఇంటరాక్ట్ అవుతారని వెల్లడించారు. అదేవిధంగా తొలి భారత టెస్ట్ కెప్టెన్, ఆంధ్ర రంజీ ట్రోఫి జట్టుకు మొదటి కెప్టెన్ కల్నల్ సి. కె. నాయుడు గారి కుటుంబ సభ్యులను సన్మానిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్టేడియం ప్రాంగణంలో ఎసిఎ మాజీ కార్యదర్శి ఎన్. వెంకట రావు పేరిట స్టాండ్ ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

# వైకాపా పాలనలో తితిదే పవిత్రతను మంటగలిపారు



అమరావతి: వైకాపా పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పవిత్రతను మంటగలిపారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మండి పడ్డారు. తితిదే ఛైర్మన్‌గా క్రైస్తవుడిని నియమించారని.. దిల్లీ లిక్కర్ స్కామ్‌లో అభియోగాలు ఎదుర్కొంటున్న శరత్‌చంద్రారెడ్డిని బోర్డు సభ్యుడిగా ఎంపిక చేశారని అచ్చెన్న విమర్శించారు. తెదేపా అధినేత చంద్రబాబు నేతృత్వంలో ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన అచ్చెన్నాయుడు.. వైకాపా ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

"సీఎం జగన్ పెట్టిన కష్టాలు మర్చిపోకుండా కార్యకర్తలు మరింత కసితో పని చేయాలి. 'ఇసుక సత్యాగ్రహం' పేరుతో ఈ నెల 28నుంచి మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించాం. సెప్టెంబరు 1 నుంచి 45 రోజుల పాటు 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ' పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. కోటి ఇళ్లను సందర్శించేలా కార్యక్రమాన్ని రూపొందించాం. ప్రభుత్వ తప్పుడు విధానాలను వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లేలా సభలు నిర్వహిస్తాం. ఈ నెల 31న యువగళం పాదయాత్ర 200వ రోజుకు చేరుకుంటుంది. ఈ సందర్భంగా నిర్వహించనున్న సంఘీభావ యాత్రలో జగన్ ప్రభుత్వ బాధితులను భాగస్వామ్యం చేయాలి. 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమంలో అధినేత చంద్రబాబు 30 నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. రాయలసీమ నుంచి చంద్రబాబు పర్యటన ప్రారంభమవుతుంది" అని అచ్చెన్న వెల్లడించారు.

# బిసిసిఐ టైటిల్ స్పాన్సర్‌గా ఐడిఎఫ్‌సి

ముంబయి: ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ క్రికెట్‌లో అడుగుపెట్టనుంది. ఈ బ్యాంక్ తాజాగా భారత్‌లో జరిగే క్రికెట్ మ్యాచ్‌ల టైటిల్ స్పాన్సర్ హక్కులను దక్కించుకుంది. మూడేళ్ల కాలానికి ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ బిసిసిఐకి రూ.235 కోట్లు చెల్లించనుంది. ఈమేరకు ఐడిఎఫ్‌సి, బిసిసిఐ మధ్య ఒప్పందం కుదిరింది. రూ.2.4 కోట్ల కనీస ధరతో వేలం ప్రక్రియ మొదలైంది. సోనీ స్పోర్ట్స్ నుంచి ఐడిఎఫ్‌సి బ్యాంక్‌కు గట్టి పోటీ ఎదురైంది. అయితే.. చివరకు రూ.4.2 కోట్లతో సొంతం చేసుకుంది. ఇక నుంచి ప్రతి అంతర్జాతీయ మ్యాచ్‌కు ఐడిఎఫ్‌సి రూ.4.2 కోట్లు చెల్లించనుంది. గతంలో కంటే రూ.40 లక్షలు ఎక్కువ. ఇంతకుముందు మాస్టర్ కార్డ్ సంస్థ ప్రతి ఇంటర్నేషనల్ మ్యాచ్‌కు రూ.3.8 కోట్లు బిసిసిఐకి ముట్టజెప్పేది. ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ మూడేళ్ల పాటు బిసిసిఐ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. 2026 ఆగస్టులో ఈ కాంట్రాక్టు ముగియనుంది.

# ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై సందేహాలుంటే ప్రపంచకప్‌నకు ఎంపిక చేయొద్దు: కపిల్



ఆగస్టు 30 నుంచి ప్రారంభంకానున్న ఆసియా కప్‌నకు టీమ్‌ఇండియా జట్టును ఇటీవల ప్రకటించారు. గాయాల కారణంగా కొన్ని నెలల నుంచి ఆటకు దూరంగా ఉన్న కేఎల్ రాహుల్ శ్రేయస్ అయ్యర్ లు ఆసియా కప్ జట్టులో చోటు దక్కించుకున్నారు. అయ్యర్ పూర్తిస్థాయిలో కోలుకున్నప్పటికీ.. కేఎల్ రాహుల్ ఇంకా మోకాలి నొప్పితో బాధపడుతున్నాడని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పేర్కొన్నాడు. ఆసియా కప్‌లో అతడు మొదటి రెండు మ్యాచ్‌ల్లో ఆడే అవకాశాలు తక్కువేనని చెప్పాడు. ఈ అంశంపై భారత మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ మాట్లాడాడు. ఆసియా కప్‌నకు శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ ఎంపిక సరైందే అని, ప్రపంచకప్‌నకు ముందు ప్రతి ఆటగాడి ఫిట్‌నెస్‌ను పరీక్షించాలన్నాడు. ప్లేయర్స్ ఫిట్‌నెస్‌ను తెలుసుకోవడానికి ఆసియా కప్ సరైన వేదిక అని పేర్కొన్నాడు. ఆటగాడి ఫిట్‌నెస్‌పై ఏవైనా సందేహాలు ఉంటే అతడిని ప్రపంచకప్‌నకు ఎంపిక చేయవద్దని కపిల్‌దేవ్ సూచించాడు. "ప్రతి ఆటగాడిని టెస్ట్ చేయాలి. మరికొన్ని రోజుల్లో ప్రపంచ కప్ ప్రారంభంకానుంది. ఇప్పటికీ మీరు ఆటగాళ్లకు అవకాశం ఇవ్వరా?వారు ప్రపంచ కప్‌నకు వెళ్లి గాయపడితే జట్టు మొత్తం ఇబ్బందిపడుతుంది. ఆసియా కప్‌లో ఆటగాళ్లకు అవకాశం ఇస్తే కాస్త లయను అందుకుంటారు. దురదృష్టవశాత్తు ప్రపంచ కప్ సమయంలో ఆటగాళ్లు మళ్లీ గాయపడితే.. జట్టులో చోటు దక్కని ఆటగాళ్లకు అన్యాయం జరుగుతుంది. గాయపడి తిరిగి జట్టులోకి వచ్చిన ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలి. వారు ఫిట్‌గా ఉంటే ప్రపంచకప్‌లో ఆడొచ్చు.

మన దేశంలో ప్రతిభకు కొదవలేదు. గాయపడిన ఆటగాళ్లు ఫిట్‌గా లేకుంటే వెంటనే ప్రపంచ కప్ జట్టులో మార్పులు చేసే అవకాశం ఉంటుంది. ప్రపంచ కప్ కోసం జట్టును రూపొందించడానికి ఆసియా కప్ రూపంలో అద్భుతమైన అవకాశం దొరికింది. తిరిగి జట్టులోకి వచ్చిన ఆటగాళ్లు రాణించాలని కోరుకుంటున్నా. వారి ఫిట్‌నెస్‌పై ఏవైనా సందేహాలుంటే పక్కన పెట్టేయండి. ఆసియా కప్‌లో మీరు వారికి అవకాశం ఇవ్వకపోతే అది ఆటగాళ్లకే కాకుండా సెలెక్టర్లకు అన్యాయం చేసినట్లవుతుంది. ప్రపంచకప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. మనం బెస్ట్, ఫిట్టెస్ట్ టీమ్‌ను ఎంచుకోవాలి" అని కపిల్‌దేవ్ సూచించాడు.

# గీతం ఐఇఇఇ విద్యార్థి విభాగం సమావేశం




సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్)** : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ లోని ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు సభ్యులుగా గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ (ఐఇఇఇ) పవర్ ఇంజనీర్స్ సొసైటి విద్యార్థి విభాగం శనివారం సమావేశం అయింది. ఈ సమావేశానికి ఐఐటి భువనేశ్వర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాస్ భాస్కర్ ముఖ్యఅతిధిగా హాజరై విద్యార్థులను ఉద్దేసించి ప్రసంగించారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కృత్రిమ మేధ కు సంబంధించిన అంశాలపై లోతైన పరిజ్ఞానం ఉన్నవారికి భవిష్యత్తులో డిమాండ్ ఏర్పడనున్నదని తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో వారికంటే ఎలక్ట్రకల్ ఇంజనీరింగ్ చదివి ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ పై పట్టు ఉన్నవారు ఎక్కువ అవకాశాలు పొందుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్తు వాహనాల అభివృద్ధి, విండ్ మరియు సోలార్ ఎనర్జీ, బయోగ్రాస్ విధానంలో విద్యుత్తు ఉత్పాదన రంగాలలో అభివృద్ధిని వివరించారు. సంప్రదాయేతర ఇందన వనరులను నూతన టెక్నాలజీ జోడించి అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్తులో విద్యుత్తు కొరతను నివారించవచ్చునన్నారు. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగేంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా ఇఇఇసిఇ విభాగం అధిపతి డాక్టర్ జె.బి.సెవెన్తలైన్, ఐఇఇఇ విద్యార్థి విభాగం కౌన్సిలర్ డాక్టర్ మహ్మద్ కె.ఎమ్.చిష్టి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## ఇదేం నిర్లక్ష్యం.. సర్జరీ చేసి.. పొట్టలో దూదిని వదిలేసి..

పట్నా: అత్యవసర పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కాన్పుకోసం ఓ మహిళ ఆస్పత్రిలో చేరితే.. సర్జరీ చేసి.. దూదిని పొట్టలోనే ఉంచి కుట్లు వేసేశారు. తీవ్ర కడుపునొప్పితో బాధితురాలు మళ్లీ ఆస్పత్రికి వెళ్తే.. కుట్లు వేసిన చోట డ్రెస్సింగ్ చేసి పంపించేశారు. ఈ ఘటన బిహార్‌లోని భగల్‌పుర్ జిల్లాలోని జవహర్‌లాల్ నెహ్రూ వైద్య కళాశాలలో చోటు చేసుకుంది. ఫిబ్రవరి నెలలో చోటు చేసుకున్న ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ప్రియాంక కుమారి అనే మహిళ ఫిబ్రవరి 19న పురుటి నొప్పులతో మయాగంజ్‌లోని వైద్యకళాశాల ఆస్పత్రిలో చేరింది. సాధారణ ప్రసవం రాకపోవడంతో వైద్యులు సర్జరీ చేసి మగ శిశువును బయటకి తీశారు. అనంతరం ఫిబ్రవరి 26న ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. కొన్ని రోజుల తర్వాత ఆమెకు కడుపునొప్పి ప్రారంభమైంది. దీంతో కుటుంబ సభ్యులు మళ్లీ అదే ఆస్పత్రికి తీసుకెళ్లగా.. కుట్లు వేసిన చోట డ్రస్సింగ్ చేసి, ఇదేం పెద్ద సమస్య కాదంటూ ఇంటికి పంపేశారు. కానీ, అసలు సమస్యను మాత్రం గుర్తించలేకపోయారు. క్రమంగా నొప్పి తీవ్రమవ్వడంతో ఆమెను దగ్గర్లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయగా.. పొట్టలో దూడి ఉండ ఉన్నట్లు గుర్తించారు. వీలైనంత తొందరగా దానిని బయటకు తీయకపోతే ప్రేగులకు కూడా ప్రమాదం తలెత్తుతుందని వైద్యులు చెప్పడంతో తాజాగా మళ్లీ సర్జరీ చేసి దానిని తొలగించారు. అదృష్టం కొద్దీ ప్రాణహాని తప్పినా..కీలక విధులు నిర్వర్తించాల్సిన వైద్యులు ఇంత నిర్లక్ష్యంగా ఉండకూడదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఘటనకు కారణమైన వైద్యులపై చర్యలు తీసుకుంటామని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

# అశోక్ గహ్లోత్ రాజీనామా చేయాల్సిందే: అమిత్ షా



జైపుర్: దేశ వ్యాప్తంగా రాజకీయ దుమారం రేపిన 'రెడ్ డైరీ' అంశానికి బాధ్యత వహిస్తూ రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ రాజీనామా చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా డిమాండ్ చేశారు. ఆ డైరీలో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అవినీతి, చీకటి ఒప్పందాలు ఉన్నాయని విమర్శించారు. రాజస్థాన్‌లో గంగాపుర్ పట్టణంలో నిర్వహించిన 'సహకార్ కిసాన్ సమ్మేళన్' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు చేసిందేమీ లేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ బడ్జెట్‌ను ఆరు రెట్లు పెంచామని గుర్తు చేశారు. అంతేకాకుండా రైతు సహకార సంఘాల కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అమిత్ షా ప్రసంగిస్తుండగా.. కొందరు భాజపాకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన ఆయన.. ' ఈ సమావేశానికి కొంత మందిని పంపించి వ్యతిరేక నినాదాలు చేయించినంత మాత్రాన ఏమీ సాధించలేరని గహ్లోత్‌కు ఈ వేదికపై నుంచి చెబుతున్నా. ఏమాత్రం సిగ్గున్నా..వెంటనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, ఎన్నికలకు దిగండి." అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మధ్య గహ్లోత్‌కు ఎరుపు రంగును చూస్తే విపరీతమైన కోపం వచ్చేస్తోందని ఎద్దేవా చేశారు. డైరీ ఎరుపు రంగులో ఉన్నా.. అందులోని ఒప్పందాలు మాత్రం నల్లనివేనని విమర్శించారు. రూ.వేల కోట్ల అవినీతికి సంబంధించిన వివరాలు ఆ డైరీలో ఉన్నాయని అన్నారు.

ఇటీవల రాజస్థాన్‌లో రెడ్ డైరీ కలకలం రేపిన సంగతి తెలిసిందే. అశోక్ గహ్లోత్ ప్రభుత్వం ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్న వివరాలు అందులో ఉన్నాయంటూ ఇటీవల ఉద్వాసనకు గురైన మంత్రి రాజేంద్ర గుఢా రెడ్ డైరీ ప్రస్తావనను అసెంబ్లీలో తెచ్చారు. రాజస్థాన్ టూరిజం అభివృద్ధి కార్పొరేషన్‌లో అవకతవకలకు సంబంధించి ఛైర్మన్ ధర్మేంద్ర రాఠోడ్ ఇంట్లో ఈడీ, ఆదాయ పన్నుశాఖ అధికారులు సోదాలు నిర్వహించినప్పుడు ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ సూచన మేరకు తాను రెడ్ డైరీని జాగ్రత్త పరిచానని రాజేంద్ర గుఢా తెలిపారు. అశోక్ గహ్లోత్, ఆయన కుమారుడు వైభవ్ గహ్లోత్‌ల సూచనల మేరకు డబ్బును ఎమ్మెల్యేలకు ఇచ్చానని రాఠోడ్ ఆ రెడ్ డైరీలో రాశారని వివరించారు. దీంతో ఇటీవల లోక్‌సభ సమావేశాల్లోనూ ఈ అంశం తీవ్ర దుమారం రేపింది.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com